www.prajanaava.in
Telugu Daily
# ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పేజీలు : 08 | వెల : 5.00
Published from: Karimnagar, Circulated to: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad
హైదరాబాద్ | సంపుటి :2 | సంచిక : 15 | శుక్రవారం | 28 జూన్ 2024



ఫైనల్‌కు టీమిండియా

8 లో



## దేశాభివృద్ధి ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలి

- పదేళ్ల పాలనలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టం
- మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత
- వికసిత్ భారత్ లక్ష్యం
- నీట్, నెట్ పేపర్ లీకేజీపై కొనసాగుతున్న దర్యాప్తు
- ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ముర్ము ప్రసంగం

**న్యూ ఢిల్లీ, జూన్ 27 :** దేశాభివృద్ధి ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలని రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ఆకాంక్షించారు. పదేళ్ల పాలనలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టమైందని తెలిపారు. రిఫా ర్మ్, పర్‌ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్ ఆధారంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పెట్టుబడులు, ఉపాధి కల్పనకు ప్రాధాన్యమిచ్చామని తెలిపారు. 18వ లోక్‌సభ తొలి సమావేశాల నాలుగోరోజు ఆమె పార్లమెంటు ఉభయసభలను ఉద్దేశించి మాట్లాడారు. గత పదేళ్లలో కేంద ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించ డంతో పాటు.. రానున్న ఐదేళ్లలో ప్రభుత్వ ప్రాధాన్య తలను ఆమె తన ప్రసంగంలో వివరించారు. మొదటగా ఆమె కొత్తగా గెలిచిన ఎంపీలకు శుభాకాంక్షలు తెలిపారు. దేశ ప్రజల విశ్వాసం గెలిచి లోక్‌సభకు ఎన్నికయ్యా రన్నారు. ప్రజల ఆకాంక్షలను ప్రతి సభ్యుడు నెరవేరు స్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ప్రథమ కర్తవ్యంగా ఎంపీలు పనిచేయాలన్నారు. ప్రజల సుస్థిరతకు పట్టాం కట్టారని.. విశ్వమంతా దేశంలో జరి గిన ఎన్నికలను పరిశీలించిందన్నారు. తమ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే

మిగతా 2 లో

## కొత్త పీసీసీ ఎవరు?



### కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు

పదవి కోసం పోటీ పడుతున్న నేతలు

సోనియాతో మధుయాష్కీ, మహేశ్ కుమార్ గౌడ్ భేటీ

ఎవరిని నియమించినా కలిసి పనిచేస్తానన్న సీఎం రేవంత్

రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకు రావడంపై సంతృప్తి

**న్యూఢిల్లీ, జూన్ 27 :** తెలంగాణ పీసీసీ చీఫ్ ఎన్నికపై అధిష్టానం కసరత్తు పూర్తి చేసిందని తెలుస్తోంది. ముఖ్య నాయకులను అందుబాటులో ఉండాలని ఏఐసీసీ ఆదేశించింది. రాత్రి 8 గంటలకు ముఖ్య నాయకులతో సీఎం రేవంత్.. ఇన్‌చార్జి దీపా దాస్ మున్షి సమావేశమవుతారు. ఆ తర్వాత ప్రకటన ఉంటుంది. ఇప్పటికే ఆశావహులు తమ ప్రయత్నాలు తాము చేసుకుంటున్నారు. పార్లమెంట్ హాల్‌లో సోనియాగాంధీని వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌గౌడ్, ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ కలిసి చర్చించారు. తమ పేర్లను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. పీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్ పార్టీని గెలిపించారు. ఆయనకు సీఎం పదవి వచ్చింది. ఇక పార్టీ బాధ్యతల నుంచి ఆయనను తప్పించి వేరే వారికి ఇస్తారని చాలా కాలంగా ప్రచారం జరుగుతోంది. కానీ అది ప్రచారంగానే ఉంది. లోక్‌సభ ఎన్నికలు అయి పోయాయి. ఈ నెల 27వ తేదీతో అంటే గురువారంతోనే రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడై మూడేళ్లు పూర్తవుతోంది. కాంగ్రెస్ పార్టీ నియమ నిబంధనల ప్రకారం పీసీసీ చీఫ్ పదవికాలం మూడేళ్లు.

మిగతా 2 లో

టీపీసీసీ అధ్యక్షుడిగా కొత్తవారిని నియమించేందుకు ఏఐసీసీ కసరత్తు చేస్తోందనే ప్రచారం నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన పీసీసీ అధ్యక్ష పదవీకాలం ముగిసిందని అన్నారు. పీసీసీ కొత్త అధ్యక్షుడిగా ఎవరిని నియమించినా వారితో కలిసి పని చేస్తానని, అధ్యక్షుడి నియామకంపై తనకంటూ ప్రత్యేక ఛాయిస్ ఏదీ లేదని ఆయన స్పష్టం చేశారు. అధిష్టానం ఎవర్ని నియమించినా వారితో కలిసి పనిచేయడమే తన బాధ్యత అని అన్నారు. తాను టీపీసీసీగా ఉన్న కాలంలో రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చిందని, పార్లమెంటు ఎన్నికల్లో మంచి పనితీరు కనబరిచామని ఆయన అన్నారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలకు మించి పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటింగ్ శాతం పెరిగిందని పేర్కొన్నారు. ఇక కేసీఆర్ పూర్తిగా చేతులెత్తేయడం వల్లే బీజేపీకి లాభం జరిగిందని పునరుద్ఘాటించారు. బీఆర్ఎస్‌కు డిపాజిట్లు వచ్చిన చోట తాము గెలిచామని, బీఆర్ఎస్ డిపాజిట్లు కోల్పోయిన చోట బీజేపీ గెలిచిందని అన్నారు. తాను కక్షపూరిత రాజకీయాలకు పాల్పడబోనని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కేసీఆర్‌ను గద్దె దింపాలన్న తన జీవిత లక్ష్యం నెరవేరిందని అన్నారు.



## సింగరేణిని ప్రైవేటీకరించేందుకే బొగ్గు గనుల వేలం

- మోడీతో కుమ్మక్కయిన సీఎం రేవంత్ రెడ్డి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు

2 లో..



## రాజీకి వచ్చిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

ముఖ్యమంత్రి రేవంత్‌తో చర్చలు

కాంగ్రెస్ సీనియర్లకు ప్రధాన్యం తగ్గదని హామీ

2 లో..




## కేసీఆర్ హయాంలో ఆర్థిక విధ్వంసం

- రూ.42 వేల కోట్లు ఖర్చుతో మిషన్ భగీరథ దోపిడీ
- గ్రామాలకు నేటికీ అందని తాగునీరు
- రూ.130 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం
- భద్రాద్రి జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న భట్టి

**ఖమ్మం, ప్రజానావ:**

గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం జరిగిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రాన్ని తాకట్టు పెట్టి ఆర్థిక విధ్వంసం చేశారన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావుతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా రూ.130 కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. అనంతరం కొత్తగూడెంలో జరిగిన సమావేశంలో భట్టి మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో మిషన్ భగీరథ కోసం రూ.42 వేల కోట్లు ఖర్చు పెట్టారన్నారు. అయినా ఇంటింటికీ

మిగతా 2 లో



## కానిస్టేబుల్ అకృత్యం

- ప్రేమపేరుతో బాలికపై రెండేళ్లుగా లైంగికదాడి
- నగ్నవీడియోలు తీసి బెదిరింపులు
- బాధితురాలి ఫిర్యాదుతో వెలుగులోకి

2 లో..

## నేడు వరంగల్‌లో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన

వరంగల్ రెండో రాజధానిగా అభివృద్ధి

పలు పరిశ్రమల ఏర్పాటు, ఆస్పత్రి నిర్మాణాలపై పరిశీలన

అధికారులతో సమీక్ష ఉంటుందన్న మంత్రి కొండా సురేఖ

**వరంగల్, ప్రజానావ:**



వరంగల్‌ను రెండో రాజధాని చేసే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి కార్యాచరణ ఉందని మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం వరంగల్‌లో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన ఉందన్నారు. మధ్యాహ్నం 1గంటకు టెక్స్ టైల్ పార్క్ కు చేరుకుని పరిశ్రమల స్థాపన, ఉపాధి కల్పనపై సీఎం పరిశీలిస్తారని తెలిపారు. వరంగల్‌లో నూతనంగా నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ను సందర్శిస్తారని చెప్పారు. హనుమకొండ కలెక్టరెట్ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సీఎం

మిగతా 2 లో

## నీట్ లీకేజీపై దర్యాప్తు ముమ్మరం

బీహార్‌లో ఇద్దరిని అరెస్టు చేసిన సీబీఐ

2 లో..

## ఫోన్ ట్యాపింగ్ నిందితులకు మరోసారి చుక్కెదురు

బెయిల్ పిటిషన్‌ను కొట్టేసిన నాంపల్లి కోర్టు

2 లో..

## దేశాభివృద్ధి

# ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలి

(మొదటిపేజీ తరువాయి)

దిశగా ముందుకెళ్తోందన్నారు. అభివృద్ధిలో తమ ప్రభుత్వం పరుగులు పెడుతుందని రాష్ట్రపతి పేర్కొన్నారు. మౌలిక వసతలు కల్పలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తోందన్నారు. వికసిత్ భారత్ లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తోందని.. రైతులు, మహిళలు, యువత సాధికరత దిశగా ప్రభుత్వం పయనిస్తోందన్నారు. సీఏఏ ప్రకారం శరణార్థులకు ప్రభుత్వం పౌరసత్వం మంజూరు చేయడం ప్రారంభించిందని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని కించపరిచే ప్రతి ప్రయత్నాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. దేశ ఖ్యాతిని దిగజార్చేలా ఎవరూ వ్యవహరించకూడదని అన్నారు. గత పదేళ్లలో తమ ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. ప్రస్తుతం మరో కీలక నిర్ణయం తీసుకోబోతున్నామన్నారు. 70 ఏళ్లు పైబడిన వృద్ధులందరికీ ఆయుష్మాన్ భారత్ కింద ఉచిత ఆరోగ్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. గతంలో తీసుకొచ్చిన ఎన్నో సంస్కరణలతో దేశంలో ఎన్నో మార్పులు తీసుకురాగలిగామని చెప్పారు. జీఎస్టీ ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థలో వాణిజ్యం, వ్యాపార కార్యకలాపాలు సులభతరమయ్యాయన్నారు. దేశ ప్రజలు సుస్థిరతకు పట్టం కట్టారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. ప్రజలు ప్రభుత్వ సుస్థిరత, నిజాయతీని నమ్మారని అన్నారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందన్నారు. పంటలకు మద్దతు ధరకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. వ్యవస్థలో ఎన్నో మార్పులు తీసుకువచ్చామని, ప్రజాక్షేమం కోసం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. గ్లోబల్ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలకు ప్రోత్సాహం అందిస్తున్నామని, రైతుల సంక్షేమం కోసం అతి పెద్ద నెట్‌వర్క్ ఏర్పాటు చేసినట్లు రాష్ట్రపతి పేర్కొన్నారు. గ్రీన్ ఎనర్జీకి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, రాబోయే రోజుల్లో అడవుల విస్తరణ ఉంటుందన్నారు. ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. ఆయుష్మాన్ భారత్‌తో దేశ ప్రజల ఆరోగ్యానికి రక్షణ కల్పిస్తున్నామని, చిన్నరైతులకు పీఎం సమ్మాన్ నిధి ఏర్పాటు చేసినట్లు రాష్ట్రపతి తన ప్రసంగంలో పేర్కొన్నారు. పదేళ్ల పాలనలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టమైందని, పెట్టుబడులు, ఉపాధికల్పనకు అధిక ప్రాధాన్యం ఇచ్చామన్నారు. త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరిస్తుందని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. ప్రభుత్వ విధానాలను ప్రజలు విశ్వసించారని, ఆర్గానిక్ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరిగిందని రాష్ట్రపతి తెలిపారు. ప్రపంచవ్యాప్త డిమాండ్ మేరకు భారత్ ఉత్పత్తులు అందిస్తోందన్నారు. ఆరోగ్య రంగంలో భారత్ అగ్రగామిగా ఉందని తెలిపారు. తమ దేశం వేగంగా పురోగతి సాధిస్తోందన్నారు. దేశంలో పేపర్ లీకేజీ ఘటనలపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పందించారు. నీట్, నెట్ పేపర్ లీకేజీపై ఆమె తన ప్రసంగంలో మాట్లాడుతూ.. దర్యాప్తు కొనసాగుతుందన్నారు. పేపర్ లీకేజీపై నిష్పక్షపాతంగా విచారణ జరుగుతోందన్నారు. నిందితులపై చర్యలు తప్పవన్నారు. పేపర్ లీకేజీపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించడం ప్రభుత్వ జవాబుదారీతనాన్ని తెలియజేస్తుందన్నారు. అలాగే దేశాన్ని మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్రపతి పేర్కొన్నారు. ఆరు దశాబ్దాల తర్వాత దేశంలో సంపూర్ణ మెజారిటీతో సుస్థిర ప్రభుత్వం ఏర్పడిరదన్నారు. ప్రస్తుత ప్రభుత్వంపై ప్రజలు మూడోసారి విశ్వాసం చూపించారని తెలిపారు. ప్రతి భారతీయుడి ఆకాంక్షలను ఈ ప్రభుత్వం నెరవేర్చగలదని రాష్ట్రపతి తెలిపారు. 18వ లోక్‌సభ అమృత కాలం ప్రారంభ సంవత్సరాల్లో ఏర్పడిరదన్నారు. త్వరలోనే ఈ ప్రభుత్వం తొలి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుందని తెలిపారు. ఈ బడ్జెట్ ప్రభుత్వ ఆర్థిక విధానాలను తెలియజేయడంతో పాటు అనేక కీలక నిర్ణయాలు బడ్జెట్‌లో ఉండే అవకాశాలున్నాయనే సంకేతాలను రాష్ట్రపతి తన ప్రసంగం ద్వారా ఇచ్చారు. దాదాపు 64 కోట్ల మంది ఓటర్లు తమ కర్తవ్యాన్ని ఉత్సాహంగా నిర్వర్తించారన్నారు. ఈసారి మహిళలు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారని తెలిపారు. కశ్మీర్ లోయలో రికార్డు స్థాయిలో ఓటింగ్ నమోదైందని తెలిపారు. రాష్ట్రపతి ప్రసంగిస్తున్నంత సేపు ప్రధాని మోడీ సహా అధికార సభ్యులు బల్లలు చరిచారు.

# నేడు వరంగల్‌లో సీఎం రేవంత్ రెడ్డి

రివ్యూ చేస్తారని వెల్లడించారు. వరంగల్ మాస్టర్ ప్లాన్ అంశం చర్చకు వస్తాయని, గతంలో ఉన్న మాస్టర్ ప్లాన్ ప్రతిపాదనలు సొంత ఎజెండాతో చేసిందని అర్థం అయ్యిందన్నారు. దాన్ని మార్చాల్సి ఉందని చెప్పారు. 3 నెలల కాలవ్యవధి పెట్టి మాస్టర్ ప్లాన్ తయారీ చేస్తామని స్మార్ట్ సిటీ పనుల అంశం చర్చ ఉంటుందని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అంశం చర్చిస్తామని సురేఖ తెలిపారు. ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణం, దాని సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తామని, మమూనూర్ ఎయిర్ పోర్ట్ అంశం కూడా చర్చకు వస్తుందని మంత్రి కొండా సురేఖ తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి వరంగల్ పర్యటన కోసం అన్ని ఏర్పాట్లు చేశామని వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. హెలికాప్టర్‌లో హైదారాబాద్ నుంచి టెక్స్ టైల్ పార్క్ కు 12 గంటలకు సీఎం చేరుకుంటారని చెప్పారు. టెక్స్ టైల్ పార్క్ సందర్శించి కొత్త కంపెనీల స్థాపన, ఉపాధి కల్పన,కోసం ప్రభుత్వ పరంగా చేపట్టాల్సి అంశాలపై సీఎం పరిశీస్తారని తెలిపారు. అక్కడ నుంచి సెంట్రల్ జైల్ కూల్చి ఆ స్థలంలో నిర్మిస్తున్న హాస్పిటల్ నిర్మాణ పనులను సీఎం పరిశీలిస్తారని చెప్పారు. అనంతరం హనుమకొండ కలెక్టరేట్ కు చేరుని వనమహోత్సం ప్రారంభించి ప్రజాప్రతినిధులు , అధికారులతో కలిసి రివ్యూ చేపడతారని వెల్లడిరచారున. హనుమకొండ కలెక్టరేట్‌లో 15 అంశాలపై సీఎం రేవత్‌రెడ్డి సుదీర్ఘంగా రివ్యూ చేస్తారని చెప్పారు. శ్రీ భద్రకాళి గుడి మాఢ వీధుల నిర్మాణం, వరంగల్ నూతన మాస్టర్, కాలోజీ కళాక్షేత్రం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, స్మార్ట్ సిటీ పనులు, రింగ్ రోడ్, మామునూరు ఎయిర్ పోర్ట్ పునరుద్దరణలంటి అంశాలపై రివ్యూ వీరీటింగ్ ఉంటుందని తెలిపారు. ఎన్నికల కోడ్ ఎఫెక్ట్ వల్ల 2 నెలలు పనులు చేయలేక పోయామని ఇప్పటికే నయింనగర్ నాలా పనులు, బ్రిడ్జి నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. గ్రేటర్ వరంగల్ లో పెండిరగ్ పలనులను స్పీడ్ గా పూర్తిచేసేందుకు సీఎం రివ్యూలో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చెప్పారు.

# కానిస్టేబుల్ అకృత్యం

- ప్రేమపేరుతో బాలికపై రెండేళ్లుగా లైంగికదాడి
- బాధితురాలి ఫిర్యాదుతో వెలుగులోకి



**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:** ప్రేమ పేరుతో బాలికపై లైంగికదాడి చేసిన కానిస్టేబుల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్ వెల్లడించారు. హైదరాబాద్ శివారులో నివసించే బాలికను కానిస్టేబుల్ ప్రదీప్ ప్రేమ పేరుతో లోబర్చుకొని లైంగికదాడి చేశాడు. వీడియోలు తీసి బెదిరిస్తూ.. నాలుగేళ్లుగా బాలికపై అఘాయిత్యానికి పాల్పడుతున్నాడు.గతేడాది వేరే అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో ప్రస్తుతం ఎయిర్–పోర్ట్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తోన్న ప్రదీప్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని.. రిమాండ్‌కి తరలించారు. అయితే మైనర్ అమ్మాయిలను బెదిరించి వారి పట్ల అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా.. వారిని వాడుకుంటున్నట్లుగా బాధితులు వాపోయారు. ఫొటోలు మార్ఫింగ్ చేసి అమ్మాయిల ఫోన్లకు పంపిస్తూ బ్లాక్ మెయిల్ చేస్తున్నట్లుగా గుర్తించారు. తనతో పడుకోకపోతే ఆ ఫొటోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తానంటూ కానిస్టేబుల్ పలువురిని బెదిరిస్తున్నట్లుగా తమ దృష్టికి వచ్చి నట్లు పోలీసులు వెల్లడించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ మైనర్ బాలికతో గత రెండు సంవత్సరాల నుండి ఎఫైర్ ఉందని.. అయితే, ఆమె గర్భం దాల్చకుండా కీచకుడు పసరు పోసినట్లుగా గుర్తించారు. పైగా బాలిక నగ్న వీడియోలు తీసి బాలిక ఫోన్‌కు కానిస్టేబు ల్ పంపాడు. తాను పిలిచినపుడు తనతో గడపాలని బెదిరించడమే కాకుండా.. వీడియోలు బయట పెడతానంటూ వేధించాడు. చేసేది ఏమీ లేక ఆ బాలిక ఆ కానిస్టేబుల్‌కు లొంగిపోయింది. శంషాబాద్ ఎయిర్ పోర్ట్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా నిందితుడు ప్రదీప్ పని చేస్తున్నాడు. 2020 బ్యాచ్‌కు చెందిన ప్రదీప్.. రాజేంద్రనగర్, కొంపల్లి, కూకట్‌పల్లిలో పని చేశాడు. అతను పని చేసిన ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఇదే వ్యవహారం నడిపాడు. ప్రదీప్ వ్యవహారం బయటకు పొక్కడంతో పై అధికారులు సీరియస్ అయ్యారు. బుధవారం సైబరాబాద్ కమిషనర్‌ను బాధితురాలి కుటుంబ సభ్యులు కలిసి ఈ విషయం చెప్పడంతో విషయం బయటికి వచ్చింది. తమను కూడా కానిస్టేబుల్ ప్రదీప్ బెదిరించినట్లుగా బాలిక కుటుంబ సభ్యులు తెలిపారు. షీ టీమ్ సహాయంతో రాజేంద్రనగర్ పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# కేసీఆర్ హయాంలో ఆర్థిక విధ్వంసం

(మొదటిపేజీ తరువాయి)

తాగు నీరు ఇవ్వలేదన్నారు. ప్రతి ఇంటికి పూర్తి స్థాయిలో నీళ్లు ఇచ్చామని చెప్పారని, రూ.125 కోట్లతో మళ్లీ పనులు ఎందుకు చేపడతామని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికీ చాలా గ్రామాలకు మంచి నీరు అందడం లేదన్నారు. గతంలో వెలుగులు నింపిన థర్మల్ ప్రాజెక్టులు మూతపడ్డాయని విమర్శించారు. థర్మల్ ప్రాజెక్టులు మొదలు పెడితే ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. ప్రజలు కోరుతున్నట్లుగా పాల్వంచ, కొత్తగూడం మున్సిపాలిటీని కలుపుతామన్నారు. కొత్తగూడెంపి సింగరేణి స్థలాల్లో ఐటీ హబ్ ఏర్పాటు, ఐటీ ఇండస్ట్రీస్ ఏర్పాటుకు కృషి చేస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత సీతారామా ప్రాజెక్టుకు 70 కోట్లు విడుదల చేయడంతో పనులు జరిగి ట్రయల్ రన్ సక్సెస్ అయిందన్నారు. రెండు గంటల్లో హైదరాబాద్ నుంచి విజయవాడకు చేరేలా రోడ్లను నిర్మిస్తున్నామని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారిని ఆరులేన్ల రోడ్డుగా నిర్మిస్తున్నామన్నారు. కేంద్ర మంత్రి గడ్కరీతో మాట్లాడి రాష్ట్రానికి పలు జాతీయ రహదారులు తీసుకొచ్చామన్నారు. రాష్ట్రంలో రహదారులను జాతీయ రహదారులుగా మారుస్తామన్నారు. 5,6 నెలల్లో కొత్తగూడంలో ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తామని అన్నారు. తమపై చేసే విమర్శలను పట్టించుకోబోమని, అభివృద్ధిపై నే దృష్టి పెడతామని మంత్రి వెంకటరెడ్డి అన్నారు. రాష్ట్రంలోని రైతులకు దాదాపు 30 వేల కోట్లతో రెండు లక్షల రుణమాఫీ చేయబోతు న్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అభివృద్ధిలో అన్నికులాలకు, మతాలకు సమాన ప్రాతినిథ్యం ఇస్తున్నామన్నారు. సీతరామా ప్రాజెక్టుతో ఖమ్మ, నల్లగొండకు గోదావరి సాగు నీరు అందుతుందన్నారు. ఈ ప్రాజెక్టు పేరుతో 9వేల కోట్లను గత ప్రభుత్వం దోచుకుందని ఆరోపించారు. తమది రైతుల ప్రభుత్వం అని చెప్పారు. ప్రజలు కన్న కలలను ప్రభుత్వం నెరవేరుస్తుందని ఆయన అన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఢిల్లీ వెళితే రాష్ట్రానికి జాతీయ రాహదారి వచ్చినట్టేనని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. కేంద్ర మంత్రి గడ్కరీని కలిసిన ప్రతిసారి రాష్ట్రానికి కొత్త రోడ్ శాంక్షన్ చేసి తీసుకొస్తారని చెప్పారు. సీతారామ ప్రాజెక్టు ట్రయల్ రన్ సక్సెస్‌తో గోదావరి జలాలను ఈ వానాకాలంలోనే సాగు కోసం అందిస్తామన్నారు. గత ప్రభుత్వం సీతారామా ప్రాజెక్టును పూర్తి చేయలేదన్నారు. 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. ఇదిలావుంటే గత ప్రభుత్వంలో పద్మశ్రీ రామచంద్రయ్యను సన్మానించి అండగా ఉంటామని చెప్పారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇందిరమ్మ, పేదల ప్రభుత్వం వచ్చిన సందర్భంలో దురదృష్టవశాత్తూ అనారోగ్య రీత్యా పద్మశ్రీ అందరికీ దూరమయ్యారు. గత ప్రభుత్వం పద్మశ్రీ రామచంద్రయ్యకు ఇచ్చిన హామీలు కాగితాలకే పరిమితమైందని వ్యాఖ్యానించారు. పద్మశ్రీ పట్ల గత ప్రభుత్వం మాటలకి పరిమితమైందే తప్ప చేతులతో ఆ కుటుంబాన్ని ఆదుకోలేకపోవటం బాధాకరం అన్నారు. పద్మశ్రీ రామచంద్రయ్యకు ఇంటి స్థలం, కోటి రూపాయల నగదు ప్రకటించిన గత ప్రభుత్వం ఆదుకోలేదు అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు.

# రాజీకి వచ్చిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

- సీఎం రేవంత్‌తో చర్చలు
- కాంగ్రెస్ సీనియర్లకు ప్రాధాన్యం తగ్గదని హామీ

**న్యూఢిల్లీ, జూన్ 27 :** కాంగ్రెస్‌లో జీవన్ రెడ్డి వివాదం సద్దుమణిగింది. సీఎం రేవంత్ రెడ్డి నివాసానికి గురువారం ఉదయం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వెళ్లారు. ఢిల్లీలో ముఖ్యమంత్రి నివాసంలో బ్రేక్ ఫాస్ట్ మీటింగ్ జరిగింది. ఈ భేటీకి మంత్రి శ్రీధర్ బాబు సైతం హాజరయ్యారు. బుధవారం ఢిల్లీలో ఏఐసీసీ ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను జీవన్ రెడ్డి కలిసారు. అధిష్టానం జోక్యంతో జీవన్ రెడ్డి తన రాజీనామా విషయంలో వెనక్కి తగ్గారు. సీఎం రేవంత్‌తో చర్చించిన తరవాత చల్లబడ్డారు. ఈ క్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, శాసనసభ్యులు అడ్లూరి లక్ష్మణ్ ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరారు. కాగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వీడడం ఖాయమన్న వార్తలకు పుల్‌స్టాప్ పడింది. తనకు సమాచారం ఇవ్వకుండానే జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకున్నారని తీవ్ర మనస్తాపం చెందిన జీవన్‌రెడ్డి ఎట్టకేలకు మెట్టు దిగారు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్నవాళ్ల అభిప్రాయాల ఆధారంగానే చేరికలు, ఇతర విషయాలలో ముందుకెళతామని అధిష్టానం హామీ ఇవ్వడంతో ఆయన శాంతించారు. రంగంలోకి దిగిన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పరిస్థితిని చక్కబెట్టారు. మూడ్రోజులుగా అసంతృప్తితో రగిలిపోతూ పార్టీని వీడేందుకు సిద్ధపడిన జీవన్‌రెడ్డికి పార్టీ అధిష్టానం నుంచి పిలుపు వచ్చింది. కేసీ వేణుగోపాల్ ఫోన్ చేసి ఢిల్లీ రావాలని కోరడంతో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి బుధవారం సాయంత్రం జీవన్ రెడ్డి ఢిల్లీకి చేరుకున్నారు. తెలంగాణ భవన్‌లోని శబరి బ్లాక్‌లో జీవన్‌రెడ్డితో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అరగంటపాటు చర్చలు జరిపారు. అయినా జీవన్‌రెడ్డి వెనక్కి తగ్గలేదు. తర్వాత ముగ్గురూ కలిసి కేసీ వేణుగోపాల్ ఇంటికి వెళ్లి ఆయనతో భేటీ అయ్యారు. కాంగ్రెస్ కష్టకాలంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్‌లోకి వెళ్లినా తాను పార్టీని నమ్ముకుని ఉన్నానని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి చెప్పినట్లు తెలిసింది. కాంగ్రెస్‌లో ఎమ్మెల్యే సంజయ్ చేరికపై అసంతృప్తి వ్యక్తం చేశారని సమాచారం. జీవన్‌రెడ్డిని బుజ్జగించిన పెద్దలు.. పార్టీ అండగా ఉంటుందని, దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పుంజుకుంటున్న సమయంలో పార్టీని వీడవద్దని కోరినట్లు తెలిసింది. దీంతో చల్లబడిన జీవన్‌రెడ్డి సమ్మతించారు. భేటీ అనంతరం బయటికి వచ్చాక జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తనకు కాంగ్రెస్సే ముఖ్యమంటూ వెల్లడించారు. కార్యకర్తలను కాపాడుకోవడం ఏ పార్టీకైనా ముఖ్యమని అన్నారు. కార్యకర్తల ఆత్మగౌరవాన్ని దృష్టిలో పెట్టుకుని, వారి ఆలోచనలకు అనుగుణంగానే నిర్ణయాలు తీసుకోవాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మెరుగైన ఫలితాలు వచ్చాయని, లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో రాహుల్‌గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, జాతి ఐక్యతను కాంగ్రెస్ కాపాడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలను కాంగ్రెస్ నెరవేరుస్తుందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలుకాని పథకాలను తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఏకకాలంలో రూ.31 వేల కోట్లతో రుణమాఫీకి కాంగ్రెస్ సంకల్పించదని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

# కొత్త పీసీసీ ఎవరు?

(మొదటిపేజీ తరువాయి)

ఆ తర్వాత కొత్త వారిని నియమించాల్సి ఉంటుంది. లేదా పొడిగించవచ్చు. అయితే, సీఎంగా, పీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్ పోస్టును మరొక నేతకు కేటాయించాలని అధిష్టానాన్ని కోరారు. నిజానికి అసెంబ్లీ ఎన్నికలు పూర్తవ్వగానే తెలంగాణ కాంగ్రెస్‌కు కొత్త బాస్ వస్తారని అంతా ఊహించారు. కానీ లోక్ సభ ఎన్నికలు వెంటనే ఉండటంతో రేవంత్ రెడ్డినే అధిష్టానం కొనసాగించేసింది. దీంతో ఇప్పుడు మార్పు అనివార్యం కాగా, రేవంత్ రెడ్డి కూడా సామాజిక న్యాయాన్ని దృష్టిలో పెట్టుకొని, కొత్త పీసీసీ చీఫ్ నియామకంపై నిర్ణయం తీసుకోవాలని రేవంత్ కోరారు. బీసీ లేదా ఎస్సీ సామాజికవర్గ నేతకు పీసీసీ దక్కే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అదే విధంగా మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, సంపత్ కుమార్ తదితరులు పీసీసీ చీఫ్ ఆశావహుల్లో ఉన్నారు. ఎస్సీ సామాజిక వర్గం నుంచి సంపత్ కుమార్, ఎస్టీ సామాజిక వర్గం నుంచి సీతక్క, బలరాం నాయక్ పేర్లు వినిపిస్తున్నాయి. రేవంత్ ఛాయిస్ గా మంత్రి సీతక్క పేరు తెర వీరీదకు వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. గిరిజన మహిళకు పీసీసీ పగ్గాలు అప్పగించటం ద్వారా సానుకూలత పెరిగే అవకాశం ఉందని ఆయన అంచనా వేస్తున్నారు. మరోవైపు పార్టీ జాతీయ స్థాయి పోస్టులుసైతం తెలంగాణ నేతలకు దక్కే అవకాశం ఉంది. సిడబ్ల్యూసీ, జనరల్ సెక్రటరీ, సెక్రటరీ పోస్టులకోసం నేతలు ప్రయత్నాలు చేసుకుంటున్నారు.

# సింగరేణిని ప్రైవేటీకరించేందుకే బొగ్గు గనుల వేలం

- మోడీతో కుమ్మక్కయిన సీఎం రేవంత్ రెడ్డి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు

**ఖైరతాబాద్, ప్రజానావ:** సింగరేణిని ప్రైవేటీకరించేందుకే తెలంగాణ బొగ్గు గనులను కేంద్ర ప్రభుత్వం వేలం వేసిందని బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. గురువారం తెలంగాణ భవన్‌లో సింగరేణి ప్రాంతానికి చెందిన మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులతోపాటు బొగ్గు గని కార్మిక సంఘం నాయకులతో కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వంతో సీఎం రేవంత్ రెడ్డి కుమ్మక్కై.. బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అందుకే సింగరేణికి బొగ్గు గనులు కేటాయించకుండా నష్టాల్లోకి నెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఆ తర్వాత సింగరేణి నష్టాల్లో ఉందంటూ పెట్టుబడుల ఉపసంహరణ కోసం రంగం సిద్ధం చేస్తున్నారని విమర్శించారు. అయితే కాంగ్రెస్, బీజేపీలు కుమ్మక్కై సింగరేణి గనులను అమ్మకానికి పెట్టిన విషయం.. ప్రతి సింగరేణి కార్మికుని అర్థమవుతోందన్నారు. ఇక తెలంగాణ ఉద్యమ సమయంలో జరిగిన సకల జనుల సమ్మె కారణంగా సింగరేణి ప్రాధాన్యతను దేశం గుర్తించిందని చెప్పారు. ఈ సమ్మె జరిగిన సమయంలో.. దక్షిణాది రాష్ట్రాలు అతలాకుతలమయ్యాయని ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తు చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల బలోపేతమే మన పార్టీ విధానమని కేటీఆర్ పునరుద్ఘాటించారు. ఉద్యమ కాలంలోనే కాదు.. అనంతర ప్రభుత్వంలో ఉన్నప్పుడు సైతం తమది ఇదే విధానమన్నారు. అందుకే ప్రైవేటు కంపెనీల ఒత్తిడులను పక్కన పెట్టి... రైతు బీమాను ఎల్ఐసీ ఇచ్చామని పేర్కొన్నారు. అలాగే విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణ బాధ్యతలను సైతం బీహెచ్‌ఈఎల్‌కి అప్పగించామని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వ హాయాంలో తెలంగాణ బొగ్గు గనులను వేలం వేయకుండా ఆపగలిగారన్నారు. కేంద్ర ప్రభుత్వం బలవంతంగా రెండు బొగ్గు గనులను ప్రైవేట్ సంస్థలకు కేటాయించినప్పటికీ.. త్రటెడు తెలంగాణ బొగ్గును ఎత్తకుండా విజయవంతంగా అడ్డుకున్నామని కేటీఆర్ వివరించారు. అయితే కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు.. ఆ పార్టీ నాయకత్వం కలిసికట్టుగా తెలంగాణ బొగ్గు గనులను వేలానికి పెట్టాయని మండిపడ్డారు. పార్లమెంట్‌లో తెలంగాణ గొంతుక లేదన్న ఓ విధమైన భ్రమతోనే కాంగ్రెస్, బీజేపీలు ఈ కుటిల ప్రయత్నాలకు తెర తీశాయన్నారు. సింగరేణి కోసం మొదటి నుంచి పోరాటం చేసి... ఆ సంస్థను బలోపేతం చేసిందే బీఆర్‌ఎస్ పార్టీ అని ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తు చేశారు. సింగరేణి కష్టాల్లో ఉంటే కార్మికులకు అండగా బీఆర్‌ఎస్ పార్టీ ఉంటుందన్న విషయాన్ని సైతం ఆ యా పార్టీల నేతలు మర్చిపోతున్నారన్నారు. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సింగరేణిని కాపాడుకుంటామని ఆ ప్రాంత నేతలకు ఈ సందర్భంగా కేటీఆర్ స్పష్టమైన హామీ ఇచ్చారు.

# ఫోన్ ట్యాపింగ్ నిందితులకు మరోసారి చుక్కెదురు

## బెయిల్ పిటిషన్‌ను కొట్టేసిన నాంపల్లి కోర్టు

**ఖైరతాబాద్, ప్రజానావ:** ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులకు మరోసారి చుక్కెదురైంది. నిందితులైన భుజంగరావు, తిరుపతన్న, ప్రణీత్ రావుల బెయిల్ పిటిషన్లను నాంపల్లి కోర్టు కొట్టివేసింది. తమను రాజకీయ దురుద్దేశంతో అరెస్ట్ చేశారని, తమపై ఎలాంటి సాక్ష్యాలు లేవని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. కేసులో అరెస్టయిన 90 రోజుల్లో ఛార్జిషీట్ వేయకపోతే డిఫాల్ట్ బెయిల్ ఇవ్వొచ్చని సుప్రీంకోర్టు ఇచ్చిన పలు తీర్పులు చెబుతున్నాయని కోర్టులో ప్రస్తావించారు. 90 రోజుల్లోనే తాము ఛార్జిషీట్‌వేశామని, వివరాలు సరిగా లేవని తిప్పి పంపడంతో తిరిగి మళ్లీ వేసినట్టు పోలీసుల తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. చివరగా పోలీసుల వాదనలతో ఏకీభవించిన నాంపల్లి కోర్టు నిందితుల బెయిల్ పిటిషన్లను కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది. ఈ క్రమంలో ఫోన్ టాపింగ్ కేసులో మరొకసారి అరెస్ట్ అయిన నిందితులకు మరోసారి చుక్కెదురు అయింది. అడిషనల్ ఎస్పీ భుజంగరావు, తిరుపతన్న, ఏసీపీ ప్రణీత్ రావు బెయిల్ పిటీషన్ నాంపల్లి కోర్టు కొట్టి వేసింది. 90 రోజుల్లో చార్జిషీటు దాఖలు చేయనందున బెయిల్ కావాలని నిందితులు కోరారు. తాము బెయిల్ పిటిషన్ వేసినప్పుడు కోర్టులో ఛార్జిషీట్ లేదని నిందితుల తరపు న్యాయవాది బెయిల్ పై వాదనల సమయంలో కోర్టుకు తెలిపారు. అరెస్టయిన 90 రోజుల్లో ఛార్జిషీట్ వేయకపోతే బెయిల్ ఇవ్వవచ్చునని వాదనలు వినిపించారు. బెయిల్ ఇవ్వవచ్చునని పలు తీర్పులు చెబుతున్నాయన్నారు. అయితే, తాము 90 రోజుల లోపే ఛార్జిషీట్ దాఖలు చేశామని పోలీసుల తరఫు న్యాయవాదులు తెలిపారు. ఛార్జిషీట్‌ను కోర్టు తిప్పి పంపించిందని... ఇలా పంపినంత మాత్రాన ఛార్జిషీట్ వేయనట్లు కాదని పోలీసులు తెలిపారు. పోలీసుల వాదనతో ఏకీభవించిన కోర్టు బెయిల్ పిటిషన్లను కొట్టి వేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసు ప్రధాన నిందితుడు తెలంగాణ ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు అమెరికా నుంచి రావాల్సి ఉంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పెద్దల ఆదేశాలపై ప్రతిపక్ష నేతలతో పాటు పలువురు ప్రముఖుల ఫోన్లు ట్యాప్ చేయించారనే అభియోగాలు ప్రభాకర్‌రావుపై నమోదు అయ్యాయి. ప్రభాకర్‌రావును ప్రశ్నిస్తేనే అన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని సిట్ అంటోంది. ఈ లెక్కన.. ఆయన దేశంలో అడుగుపెట్టిన వెంటనే అరెస్ట్ అయ్యే ఛాన్స్ కనిపిస్తోంది. ఇప్పటికే ప్రభాకర్‌రావు పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యింది.. ఆయన వీసా గడువు ముగి సిందని ఎప్పుడైనా ఇండియాకు రావొచ్చని భావిస్తున్నా రు. అనారోగ్య సమస్యల వల్ల చికిత్స కోసం వచ్చానని పోలీసులకు అందుబాటులో ఉంటానని జూన్26న భారత్? కు వస్తానని అడ్వకేట్ ద్వారా ప్రభాకర్ రావు కోర్టులో మెమో దాఖలు చేశారు. అయితే ఆయన రాలేదు.

# నీట్ లీకేజీపై దర్యాప్తు ముమ్మరం

## బీహార్‌లో ఇద్దరిని అరెస్టు చేసిన సీబీఐ

**న్యూఢిల్లీ, జూన్ 27 :** నీట్–యూజీ 2024 పరీక్ష పేపర్ లీక్ కేసు దర్యాప్తును సీబీఐ వేగవంతం చేసింది. దీనికి సంబంధించి అరెస్టులు మొదలుపెట్టింది. ఈ కేసుతో సంబంధం ఉన్నట్లు భావిస్తున్న మనీశ్ ప్రకాశ్, అశుతోష్‌ను బిహార్‌లోని పట్నాలో అదుపులోకి తీసుకొంది. ఈ కేసులో లీకైన పేపర్‌ను పొందిన విద్యార్థులను మనీశ్ తన కారులోనే తరలించినట్లు గుర్తించారు. వీరిలో రెండు డజన్ల మందికి అతడే ఒక రూమ్ కూడా బుక్ చేసినట్లు తెలుస్తోంది. ఇక రెండో నిందితుడైన అశుతోష్ పేపర్ లీక్‌లో భాగస్వాములైన విద్యార్థులకు తన ఇంట్లోనే ఆశ్రయం కల్పించాడు. ఇప్పటికే పేపర్ లీక్‌కు సంబంధించి సీబీఐ క్రిమినల్ కేసు నమోదు చేసింది. దీంతోపాటు బిహార్, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వాలు నమోదు చేసిన అభియోగాలను కూడా తమకు బదలాయించాలని నోటీసులు జారీ చేసింది. ఇప్పటికే గుజరాత్‌లోని గోద్రా తాలుకా పోలీస్‌స్టేషన్‌లో మాల్‌ప్రాక్టీస్‌పై ఓ ఎఫ్ఐఆర్ నమోదైంది. సీబీఐ మొత్తం ఈ వ్యవహారంలో ఆరు కేసులను దర్యాప్తు చేస్తోంది. నీట్–యూజీ 2024 పరీక్షను దేశవ్యాప్తంగా మే 5వ తేదీన నిర్వహించింది. దీనికి 24 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పేపర్ బిహార్, గుజరాత్ రాష్ట్రాల్లో లీకైనట్లు ఇటీవల కాలంలో ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ మధ్యలోనే జూన్ 4న ఎన్‌టీఏ ఫలితాలు ప్రకటించడం వివాదాస్పదంగా మారింది. దీంతో కేంద్రం కూడా ఈ వ్యవహారంపై దృష్టి సారించింది.



# అమరావతి పేరు పెట్టింది రామోజీరావే..

**విజయవాడ, ప్రజానావ:** ఏపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన రామోజీరావు సంస్మరణ సభకు పాత్రికేయ, సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. విజయవాడ శివారు కానూరులోని అనుమోలు గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన సభకు రామోజీరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు రామోజీరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ క్రమంలోనే అమరావతి కోసం రామోజీ గ్రూప్ రూ. 10 కోట్లు విరాళం అందించింది. ఈ మేరకు రామోజీ కుమారుడు, ఇతర కుటుంబ సభ్యులు సీఎం చంద్రబాబుకు విరాళం చెక్కు అందించారు. నాన్నగారి సంస్మరణ సభకు హాజరైన అందరికీ నమస్సులు అని కిరణ్ తెలిపారు. నవ్యాంధ్ర రాజధానికి అమరావతి పేరును నాన్నగారే సూచించారని, దేశంలోనే గొప్ప నగరంగా అమరావతి ఎదగాలని నాన్నగారు ఆకాంక్షించారని ఆయన పేర్కొన్నారు. ప్రజా శ్రేయస్సు కోసం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం జీవితాంతం పరితపించిన వ్యక్తి రామోజీరావు అని కిరణ్ పేర్కొన్నారు. ప్రజల హక్కులను పాలకులు కబళించి నప్పుడల్లా ఆయన బాధితుల పక్షం వహించే వారని తెలిపారు. దేశంలో ఎక్కడ ఏ ఉపద్రవం వచ్చినా ఆదుకునేందుకు సిద్ధంగా ఉండేవారని చెప్పారు. ఆయన నమ్మిన పాటించి న విలువలను త్రికరణ శుద్ధిగా కొనసాగిస్తామని తమ కుటుంబ సభ్యులు, తన తరపున సభాముఖంగా మాటిస్తున్నట్లు కిరణ్ ప్రకటించారు.

## బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా
# మెడిసిన్ విద్యార్థికి ఆర్థిక సాయం

**మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా అందజేత**



**ఉప్పల్, ప్రజానావ:** ఉప్పల్ నియోజకవర్గం చిలుక నగర్‌కి చెందిన గోపి శెట్టి చెన్న కేశవుల కుమారుడు శశి కుమార్ సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీట్ సాధించాడు. మెడిసిన్ చదువు చదివే స్థోమత లేక ఇబ్బంది పెడుతున్న విషయం తెలుసుకున్న బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ట్రస్ట్ ద్వారా గురువారం మాజీ సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ఎర్ర వెల్లి ఫాం హౌస్ లో 60 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మెడిసిన్ సీటు సాధించిన వారికి 5 సంవత్సరాలకు అయ్యే ఫీజు మొత్తం చెల్లిస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు ప్రజలకు
# జవాబుదారీగా పనిచేయాలి

**రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు**



**నాగర్ కర్నూల్, ప్రజానావ:** ప్రజాపాలనలో పారదర్శకతే అత్యంత ప్రామాణికమని, అధికారులు ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ గౌరవమైన పాలన అందించాలన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా అభివృద్ధిపై గురువారం కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధిపై కలెక్టర్ బదావత్ సంతోష్ అధ్యక్షతన జిల్లా ఎమ్మెల్యేలు రాజేష్‌రెడ్డి, వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్సీలు దామోదర్‌రెడ్డి, గోరటి వెంకన్నలతో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన సేవలను అందించి ప్రభుత్వ సంస్థలపై నమ్మకం కలిగేలా అధికారుల చర్యలు ఉండాలన్నారు. అధికారులు ప్రజలను గౌరవిస్తూనే వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాల న్నారు. ఇది ప్రజా ప్రభుత్వమని, సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు ఇందిర మ్మ పాలన అందించాలనే కృత నిశ్చయంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. జిల్లాలో రైతులందరికి సాగునీరు అందించేందుకు ప్రాజెక్టులు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు భూసేకరణ వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆస్తులు, ములను కాపాడేందుకు ప్రత్యేక చొరవ చూపాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ధరణి సమస్యలు ఎదుర్కొంటున్న రైతుల వివరాలను ప్రతీ గ్రామంలో గుర్తించి పరిష్కరించాలన్నారు. ఇక నుంచి ప్రతీ రెండు నెలలకు ఒకసారి జిల్లా స్థాయి సమీక్షా సమావేశం ఉంటుందని మంత్రి తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు కె.సీతారామారావు, చీర్ల శ్రీనివాసులు, జిల్లా అటవీశాఖ అధికారి రోహిత్, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఆర్డీవోలు, ఎంపీడీఓలు, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అవన్నీ పీఆర్ స్టంట్లు

- రోగులు విలవిల్లాడుతున్నారు
- పనికిమాలిన పథకాలపై కోట్లు ఖర్చు పెడుతున్నారు
- బీఆర్ఎస్ నేత రాకేష్ రెడ్డి ఫైర్



**ఖమ్మం, ప్రజానావ:** ఆరునెలల తరువాత జిలాల్లో అధికారికంగా తిరగడానికి ముఖ్యమంత్రికి తీరింది అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి ఎద్దేవా చేశారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీపై దాడులు, ఢిల్లీ టూర్లు.. కేసులు నమోదు.. పీఆర్ స్టంట్లు చేయించడం ఇవ్వన్నీ పూర్తి చేసుకుని పర్యటనకు వెళ్తు న్నారన్నారు. ఉద్యమాల గడ్డ ఓరుగల్లు పర్యటన మొదట ఎంచుకోవడం మంచిదే కానీ ప్రైవేట్ ఆస్పత్రి ప్రారంభించడానికి వెళ్లడం విడ్డురంగా ఉందన్నారు. ఓరుగల్లు పర్యటన సందర్భంగా సీఎంకు మా 5 డిమాండ్లు అన్నారు. ఎంజీఎంను సందర్శించాలి, కేసీఆర్ శంకుస్థాపన చేసిన మల్టిస్పెషాలిటీ ఆస్పత్రి పనులు త్వరగా పూర్తి చేసేలా ఆదేశాలు ఇవ్వాలి, ఎయిమ్స్ ఆస్పత్రిలో ఉన్న సమస్యలు తీర్చాలి, కాకతీయ తోరణం ఉంచుతారా లేదా..? సీఎం వైఖరి చెప్పాలని డిమాండ్ చేశారు. గొప్ప చరిత్ర ఉన్న ఎంజీఎం సందర్శించాల్సింది పోయి కార్పొరేట్ ఆస్పత్రి సీఎం తన చేతులతో ఓపెన్ చేయబోతున్నారన్నారు. రాష్ట్రంలో దయనీయంగా ప్రభుత్వ ఆస్పత్రులు ఉన్నాయన్నారు. ఆస్పత్రిలో తక్కువ మంది వైద్యులతో రోగుల భారీ క్యూ లైన్లు కనిపిస్తున్నాయన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో టెస్టుల కోసం ప్రైవేట్ సంస్థలపై ఆధారపడాల్సి వస్తుందని ఆరోపించారు. ఎంజీఎం ఆస్పత్రిలో సరిపడ బెడ్లు లేవు, పారామెడికల్ విధానం లేదు, ఒక్కో బెడ్‌లో ఇద్దరు ముగ్గురు రోగులు ఉంటున్నారన్నారు. చాలి చాలని వసతుల మధ్య చికిత్స చేస్తున్న డాక్టర్లకు మొక్కాలని, ఎంజీఎం ఆస్పత్రిలో కరెంట్ 5 గంటల పాటు లేకపోవ డంతో రోగులు విలవిల్లాడారన్నారు. కాంగ్రెస్ పాలన అటకెక్కిందని మండిపడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మూలిగే నక్కమీద తాటికాయ పడినట్లుగా ఉందని, స్వతంత్ర దేశంలో ఉచిత వైద్యం కోసం ఇంకా మీడియా ముందు మాట్లాడం దురదుష్టకరం అన్నారు. ఆరోగ్యశ్రీలో ఏ వ్యాధి కి వర్తిస్తుందో ప్రకటించాలని డిమాండ్ చేశారు. అది తెలియక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పనికి మాలిన పథకాల మీద కోట్లు ఖర్చు పెడుతున్నారని, అదికాకుండా పేద వాడి ఆరోగ్యం కోసం ఖర్చు చేయాలని కోరారు.



## బుగ్గారెడ్డి ఆసుపత్రి ఎదుట
# శవంతో ఆందోళన

- ఆసుపత్రిలో ఇప్పటి వరకు ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు

**షాద్‌నగర్, ప్రజానావ:** నియోజకవర్గంలోని బుగ్గరెడ్డి ప్రైవేట్ హాస్పిటల్‌లో ఈనెల 20వ తేదీ గురువారంన వైద్యం కోసం కేశంపేట మండలం వేములనర్వ గ్రామానికి చెందిన మహేష్ అనే 30 సంవత్సరాల యువకున్ని వారి బంధువులు వైద్యం కోసం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువ చ్చారు. అతని పరిస్థితి చూసి వైద్యులు హైదరాబాద్ ఉస్మానియా లేదా గాంధీకి తీసుకెళ్లాలని సూచించినట్లు వారి బంధువులు మీడియాతో తెలిపారు. మృతుడి బంధువుల వివరాల ప్రకారం.. మహేష్‌ను మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వ అంబులెన్స్ లో హైదరాబాద్ కు ప్రయాణ మయ్యారు కానీ అంబులెన్స్ సిబ్బంది పట్టణంలోని బుగ్గరెడ్డి హాస్పిటల్‌లో మెరుగైన చికిత్స అందిస్తున్నారు అని సూచించారు. వారి మాట విని వెనుదిరిగి బుగ్గారెడ్డి ఆసుపత్రికి మహేశ్‌ను తరలించి వైద్యము కోసం ఈనెల 20 న చేర్పించారు. ఆరు రోజులు బుగ్గరెడ్డి ఆసుపత్రి వైద్యులు అతని పరిస్థితి చూసి కిడ్నీలకు సంబంధించి డయాలసిస్ చెయ్యాలని హైదరాబాద్ మహావీర్‌కు పంపించారు. అక్కడ డయాలసిస్ చేస్తున్న క్రమంలో మహేష్ ప్రాణాలు కోల్పోయాడు. అక్కడ డయాలసిస్ చేసిన డాక్టర్లు రెండు రోజుల క్రితం తీసుకొస్తే బ్రతికేవాడని ఇంత విషమించే వరకు ఏం చేశారని నిలదీశాడని వారు తెలిపారు. బుగ్గరెడ్డి ఆసుపత్రి వైద్యులు నిర్లక్ష్యంగా తమ కుటుంబ సభ్యుడి ప్రాణాలు తీశారని, వాళ్ళ నుంచి కానప్పుడు ముందే చెబితే తమ మహేష్ బ్రతికే వాడని మీడియా ముందు బోరున విలపించారు. తమకు న్యాయం జరిగే వరకు శవాన్ని తియ్యమని బగ్గారెడ్డి ఆసుపత్రి ఎదుట శవంతో ఆందోళన చేపట్టారు. ఇదిలా ఉంటే డాక్టర్ లు ఆసుపత్రి యాజమాన్యం మాత్రం వారు డబ్బులు కట్టే స్థోమత లేక ఇక్కడికి వచ్చారు. అతని ఆరోగ్యం ఇంతలా దెబ్బ తినడానికి అతను వాడిన ఆయుర్వేద ఔషధం కారణమని చెబుతున్నారు. బాధితులు మాత్రం మేము వైద్యం కోసం రెండు లక్షలకు పైగా ఖర్చు పెట్టాం అయినా తమ మహేష్ ప్రాణాలు తీశారని తమకు న్యాయం జరిగే వరకు శవాన్ని తియ్యమని ఆసుపత్రి ఎదుట బైఠాయించారు.

# దివ్యాంగుల సంక్షేమానికి పెద్ద పీట

**ఉద్యోగాలను కల్పించేలా ప్రత్యేక జాబ్ వెబ్ పోర్టల్ : మంత్రి సీతక్క**




**ఖైరతాబాద్, ప్రజానావ:** దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపే సంకల్పంతో దివ్యాంగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని అన్నారు. మలక్‌పేటలోని దివ్యాంగుల సంక్షేమ భవన్ ఆవరణలో గురువారం దివ్యాంగుల ఉద్యమ సారధి, హక్కుల కార్యకర్త హెలెన్ కెల్లర్ విగ్రహావిష్కరణ అనంతరం రవీంద్ర భారతిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున హెలెన్ కెల్లర్ 144వ జయంతి ఉత్సవాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దివ్యాంగులకు విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కల్పన వరకే ప్రభుత్వం పరిమితం కాకుండా సంక్షేమ బడ్జెట్లో దివ్యాంగులకు జనాభా ప్రాతిపదికన 5 శాతం నిధులను వెచ్చిస్తున్నమని తెలిపారు. దివ్యాంగుల ఉపకరణాల కోసం గత ప్రభుత్వం ఏడాదికి రూ. కోటి ఖర్చు చేస్తే.. తమ సర్కార్ ఈ ఏడాది రూ. 71 కోట్ల భారీ మొత్తాన్ని కేటాయించిందని వెల్లడించారు. దివ్యాంగులకు అవసరమైన సహాయ ఉపకరణాలను, లాప్‌టాప్‌లను ఉచితంగా పంపిణీ చేశారు. దివ్యాంగులకు ఉపకరణాలను మంత్రి స్వయంగా అమర్చారు. ప్రైవేటు రంగంలో దివ్యాంగులకు ఉద్యోగాలను కల్పించేలా ప్రత్యేక జాబ్ వెబ్ పోర్టల్‌ను ఆవిష్కరించారు. మీసేవా కేంద్రాలకు వెల్లకుండానే దివ్యాంగులు సదరం సర్టిఫికేట్ పొందేలా ప్రత్యేక యాప్‌ను ప్రారంభించారు. వైకల్యం ఉందని ఎవరూ కుంగిపోకుండా హెలెన్ కెల్లర్ స్ఫూర్తిగా ముందుకు సాగలన్నారు. వికలాంగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని తెలిపారు. దివ్యాంగులకు అసరగా ఉండే ఉపకరణాల కోసం ఈ ఏడాది రూ. 71 కోట్ల భారి మొత్తాన్ని కేటాయించినట్లు గుర్తు చేశారు. ఉన్నత విద్యా సంస్థల్లో వికలాంగులకు ఐదు శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. దివ్యాంగులకు విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కల్పన వరకే ప్రభుత్వం పరిమితం కాకుండా సంక్షేమ బడ్జెట్‌లో దివ్యాంగులకు జనాభా ప్రతిపదికన ఐదు శాతం నిధులను కేటాయించామని మంత్రి సీతక్క వెల్లడించారు. దివ్యాంగులను ఆర్థికంగా ముందంజలో నిలిపేందుకు వ్యాపారాల్లోనూ వారిని ప్రోత్సహిస్తామన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తికి త్వరలో రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తామని అన్నారు. 21 రకాల వైకల్యాలను గుర్తించి సదరం ధృవీకరణ పత్రాలను త్వరలో జారీ చేస్తామని తెలిపారు. వికలాంగులు మీసేవా కేంద్రాల వద్ద పడిగాపులు పడకుండా ఇంటి నుంచే సదరం ధృవీకరణ పత్రాల ప్రక్రియను పూర్తి చేసేలా యాప్‌ను ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, మహిళా శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి వాకాటి కరుణ, కమిషనర్ కాంతి వెస్లీ, వికలాంగులు, వయోవృద్ధులు సాధికారత శాఖ డైరెక్టర్ శైలజ, ఎండీ ప్రభంజన్, ఇతర అధికారులు, కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్ పాల్గొన్నారు.

# సీతారామ ట్రయల్ రన్ విజయవంతం

## గోదావరి వద్ద మంత్రి తుమ్మల పూజలు

**ఖమ్మం, ప్రజానావ:** ఉమ్మడి ఖమ్మం జిల్లా కలల ప్రాజెక్టు సీతారామా ప్రాజెక్టు ప్రారంభానికి సిద్ధమవుతోంది. గురువారం నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతంగా పూర్తయ్యింది. ప్రాజెక్టులోని మొదటి పంపు నుంచి గోదావరి జలాలను ట్రయల్ రన్‌లో విడిచి పెట్టారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సీతారామ ప్రాజెక్టు మోటార్ల ట్రయల్ రన్ సక్సెస్ అయింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు వద్ద మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అధికారులతో కలిసి మోటార్ల ట్రయల్ రన్‌ను పర్యవేక్షించారు. ట్రయల్ రన్ విజయవంతం కావడంతో మంత్రి తుమ్మల హర్షం వ్యక్తం చేశారు. ఆగస్టు 15 నాటికి ప్రాజెక్టుకు సంబంధించిన పక్రియను పూర్తి చేసి ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది. అందుకు తగ్గట్టుగానే ముందస్తుగా ట్రయల్ నిర్వహించింది. ఈ మేరకు మంత్రి తుమ్మల సమక్షంలో ట్రయల్ రన్ జరిగింది. ఉమ్మడి ఖమ్మంలోని సుమారు పది లక్షల ఎకరాలకు సాగు నీరు అందించేందుకు ఉద్దేశించి అశ్వాపురంలో సీతారామ ప్రాజెక్ట్‌ను మంత్రి తుమ్మల లాంఛనంగా ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు దాదాపు పూరత్యింది. దీనికి సంబంధించిన ట్రయల్ రన్‌ను గురువారం చేపట్టారు. మొదటి పంపు నుంచి గోదావరి నీళ్లు ఎగసి పడుతుంటే మంత్రులు, ప్రజాప్రతినిధులు సామాన్య ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఆనందంతో ఉబ్బితబ్బిబ్బైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భూమాతకు ప్రణమిల్లారు. ఎన్నో ఏళ్ల ప్రజల కల నెరవేరే సమయం ఆసన్నమైందన్న మంత్రులు వీల్కైనంత త్వరగా పెండిరగ్ పనులు పూర్తి చేయాలని సూచించారు. తన చివరి కోరిక ఖమ్మం జిల్లా ప్రజలకు గోదావరి జలాలు అందివ్వడమేనని అది నెరవేరుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ప్రాజెక్టులో భాగమైన ఇంజనీర్లకు, భూములు ఇచ్చిన రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. 2004 కంటే ముందే దీనికి ప్రతిపాదనలు సిద్ధమైన రూపుదాల్చలేదు. 2016 ఫిబ్రవరి 16న కేసీఆర్ సీఎం హోదాలో శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ హయాంలో పనులు పూర్తి అయ్యాయి. గత కేసీఆర్ ప్రభుత్వంలో 17 వేల కోట్ల అంచనాతో ప్రతిష్టాత్మకం గా సీతారామ ప్రాజెక్టు చేపట్టారు.



# నేడు పదవ తరగతి సప్లిమెంటరీ ఫలితాలు

**ఖైరతాబాద్, ప్రజానావ:** తెలంగాణలో పదవ తరగతి సప్లిమెంటరీ ఫలితాలు నేడు విడుదల కానున్నాయి. మధ్యాహ్నం 3 గంటలకు ఎస్సెస్సీ బోర్డు అధికారులు ఫలితాలను విడుదల చేయనున్నారు. అనంతరం ఫలితాలను అధికారిక వెబ్ సైట్ లో చూసుకోవొచ్చు. వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించని విద్యార్థులకు జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించారు. ఇక పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాల్లో 91.31 శాతం ఉత్తీర్ణత నమోదైన విషయం తెలిసిందే. 93.23 శాతం బాలికలు, 89.42 శాతం బాలురు ఉత్తీర్ణత సాధించారు. 3,927 పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత కాగా, ఆరు పాఠశాలల్లో జీరో శాతం ఉత్తీర్ణత నమోదయ్యింది. ఇక గతేడాది వార్షిక పరీక్షలో 89.60 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, ఈ ఏడాది 91.31 శాతానికి పెరిగింది. ఈ ఏడాది వార్షిక పరీక్షలను మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు నిర్వహించారు. 2,57,952 మంది బాలురు, 2,50,433 మంది బాలికలు సహా మొత్తం 5,08,385 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. అయితే, సప్లిమెంటరీ పరీక్షలు రాసిన విద్యార్థులు.. ఫలితాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**సిరిసిల్ల, ప్రజానావ:** సిరిసిల్ల పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన కుడికెల నాగరాజు ఇటీవల ఆర్థిక ఇబ్బదులతో ఆత్మహత్య చేసుకున్నాడు. అలాగే టెక్స్‌టైల్ పార్క్ ఇందిరమ్మ కాలనీకి చెందిన ముదిగొండ నరేశ్ కూడా ఆత్మహత్య చేసుకోవడంతో బాధిత కుటుంబాలకు గురువారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నాగరాజు కుటుంబానికి 25 కిలోల బియ్యం, రూ.10వేల సాయం అందించగా, నరేశ్ కుటుంబసభ్యులకు రూ.5వేల సాయం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ పద్మశాలి సంఘం కన్వీనర్ బూర మల్లేశం మాట్లాడుతూ సమస్యలకు ఆత్మహత్యలు పరిష్కారం కాదని.. ధైర్యంతో ఉండాలని వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు గాజుల బాలయ్య, గుడ్ల వీరభద్రయ్య, మెదక్ జిల్లా అధ్యక్షుడు గౌడ రాజేశం, నల్ల గోవిందు, వార్డు కౌన్సిలర్, తదితరులు పాల్గొన్నారు.



నీట్ పరీక్షతో పాటు ఎన్టీఏ సంస్థను రద్దు చేయాలని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు గురువారం సాయంత్రం నిరసన ప్రదర్శన నిర్వహించాల్సి ఉండగా భారీ వర్షం కారణంగా కార్యక్రమాన్ని నిలిపివేశారు. అనంతరం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూను కలిసి మెమోరాండం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు బూర సదానందం, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు దొంతుల శ్రీహరి, ప్రధాన కార్యదర్శి అవ్వారం సుధాకర్ రెడ్డి, జిల్లా బాధ్యులు కే.సరేందర్, ఎం.దశరథం, ఆర్. నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

– సిరిసిల్ల, ప్రజానావ

## డా.పీసీ ఆదిత్యకు ఉత్తమ దర్శకుడిగా పురస్కారం



**దిల్‌సుఖ్‌నగర్, ప్రజానావ:** నిత్య ప్రయోగశిలి దర్శకుడు డా. పీసీ ఆదిత్యకు కోలకతాకు చెందిన ప్రముఖ సాంస్కృతిక సంస్థ కళా సంఘం ఫౌండేషన్ వారు ఉత్తమ దర్శకుడిగా పురస్కారం అందజేశారు. గత రెండు దశాబ్దాలుగా సినీ రంగంలో వినూత్న ప్రయోగాలు చేస్తూ సమాజానికి సందేశం ఇస్తున్న పీసీ ఆదిత్య సేవలను గుర్తించి కోల్‌కతాకు చెందిన సంస్కృతిక సంస్థ కళా సంఘం ఫౌండేషన్ స్థాపకురాలు దేవాంజలి అధికారి, సంస్కార్ న్యూస్ చీఫ్ ఎడిటర్ విజయ్ కుమార్ శర్మ సొంత పత్రాన్ని ఆదిత్యకు పంపించారు. సినీ ప్రతిభా శాలి డా. పీసీ ఆదిత్యను ఉత్తమ దర్శకుడిగా సత్కరించడం తమ సంస్థకు దక్కిన ఉన్నత గౌరవంగా భావిస్తున్నామని సంస్థ స్థాపకురాలు దేవాంజలి అధికారి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీసీ ఆదిత్య స్పందిస్తూ తన సుదీర్ఘ సినీ ప్రయాణంలో ఇప్పటికే ఎన్నో పురస్కారాలు, సత్కారాలు, అవార్డులు, రికార్డులు అందుకున్నానని, ప్రపంచ స్థాయిలో సాహితీ కేంద్రంగా పేరు ప్రఖ్యాతులు ఉన్న కోల్‌కతా నుంచి ఉత్తమ దర్శక పురస్కారం లభించడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ఈ స్పూర్తితో మరిన్ని మంచి చిత్రాలు రూపొందించి ఈ చిత్రాల్లో నూతన కళాకారులు, సాంకేతిక నిపుణులకు అవకాశం కల్పిస్తానని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఉత్తమ దర్శకుడు పురస్కారం పొందినందుకు ఆదిత్యను పలువురు అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# నూతన చట్టాలపై అవగాహన తప్పనిసరి


- రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు
- తప్పించుకు తిరుగుతున్న నేరస్తులపై నాన్‌బెయిలబుల్ వారెంట్లు జారీ చేయాలి
- నేర సమీక్షలో అధికారులతో రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**సిరిసిల్ల, ప్రజానావ:** దేశ వ్యాప్తంగా జులై 1 నుంచి అమలు కానున్న నూతన చట్టాలపై ప్రతి ఒక్కరూ పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. గురువారం ఆయన అధికారులతో నేరాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నూతన చట్టాలైన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్)పై ప్రతీ పోలీస్ అధికారి, సిబ్బందికి అవగాహన ఉండాలనే ఉద్దేశంతోనే శిక్షణా తరగతులు నిర్వహించామని తెలిపారు. కొత్త చట్టాలు అమలు జరిగిన వెంటనే ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని సెక్షన్లపై పూర్తి అవగాహన ఉండాలని, నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు, విధి విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందన్నారు. ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించేందుకు వీలుగా ఉంటుందన్నారు. అధికారులు, సిబ్బంది కొత్త చట్టాలను నేర్చుకొని అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రజల్లో నమ్మకం,భద్రత పై విశ్వాసం కలిగించేందుకు విజిబుల్ పోలీసింగ్ అమలు చేయాలని, పోలీస్ స్టేషన్ కి వచ్చే ప్రతి ఫిర్యాదులపై తక్షణమే స్పందించి చట్ట ప్రకారం న్యాయం చేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు, వాటి పురోగతి, పెండింగ్‌లో ఉండటానికి గల కారణాలు అడిగి తెలుసుకుని, వాటి సంఖ్యను తగ్గించేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి(బ్లాక్ స్పాట్స్), ప్రమాదాలకు గల కారణాలను గుర్తించి, వాటి నివారణకు సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలన్నారు. వాహనాలు వేగాన్ని నియంత్రించడానికి రోడ్ల పై, మూల మలుపుల వద్ద, అప్రోచ్ రోడ్ల వద్ద భారీ కేడ్స్, రబ్బర్ స్టిప్స్, సైన్ బోర్డ్స్, స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతి రోజూ డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు, వాహన తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ప్రాసిక్యూషన్ లో భాగంగా కోర్టు జారీ చేసిన నాన్ బెయిలబుల్ వారెంట్లను నిందితులపై లేదా తప్పించుకుని తిరుగుతున్న నేరస్తులపై అమలుపరచడానికి అధికారులు, సిబ్బంది అందరూ కృషి చేయాలని సూచించారు. నాన్ బెయిలబుల్ వారెంట్లను త్వరగా ఎగ్జిక్యూట్ చేయడంతో కేసు విచారణ విజయవంతంగా పూర్తయి బాధితులకు సకాలంలో న్యాయం జరుగుతుందన్నారు.

### చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిఘా..

చట్టవ్యతిరేక కార్యక్రలాపాలైన గంజాయి, గుడుంబా, పేకాట, పీడీఎస్ రైస్, అక్రమ ఇసుక రవాణా వంటి వాటిపై ప్రత్యేక నిఘా ఉంచి దాడులు నిర్వహించి వాటి నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి కట్టడి చేయాలన్నారు. జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలపై పటిష్ట నిఘా ఏర్పాటు చేసి కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. మీకోసం ప్రోగ్రాంలో భాగం గా పోలీస్ అధికారులు , సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ రోడ్ ప్రమాదాలు, ట్రాఫిక్ రూల్స్, సైబర్ నేరాలు, షీ టీమ్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. తెలంగాణ పోలీస్ శాఖ అమలు పరుస్తున్న ఫంక్షనల్ వర్టికల్స్ సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజలకు సమర్థవంతంగా సేవలు అందించాలని అన్నారు. గత నెలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 22 మంది పోలీస్ అధికారులకు, సిబ్బందికి ప్రశంశ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమం లో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు చంద్రశేఖర్ రెడ్డి, సర్వర్, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.



## కేరళలో భారీ వర్షాలు

### పాఠశాలలకు సెలవులు

**తిరువంతపురం:** కేరళను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో వాతావరణశాఖ పలు హెచ్చరికలు, సూ చనలు జారీ చేసింది. నైరుతి రుతుపవనాలు కేరళ మీదు గా మరికొన్ని రోజులు కొనసాగనున్నాయని తెలిపింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. మహారాష్ట్ర-కేరళ తీరాల వెంబడి సముద్ర మట్టంలో ద్రోణి ఏర్పడిందని వాతావం-ణశాఖ అధికారులు పేర్కొన్నారు. మధ్య గుజరాత్ పరిసర ప్రాంతాలలోనూ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని తెలిపారు. కేరళ తీరంలో గంటకు 35 కిలోమీటర్ల నుంచి 45 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నందున మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని అధికారులు సూచించారు. వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో కేరళలోని ఆరు జిల్లాల్లో పాఠశా లలను మూసివేశారు. పతనంతిట్ట, కొట్టాయం, అలప్పుజ, ఇడుక్కి, ఎర్నాకులం, వయనాడ్‌లలో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి.

## వనమహోత్సవనాకి ఏర్పాట్లు

**నారాయణఖేడ్, ప్రజానావ :** త్వరలో ప్రారంభం కానున్న వన మహోత్సవ కార్యక్రమానికి ఏర్పాట్లు చురుకుగా కొనసాగుతున్నాయి. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలు, రహదారులకు ఇరువైపులా చెట్లను నాటేందుకు ఉపాధిహామీ కూలీలతో గుంత లు తీసే పనులు చేపడుతున్నారు. ఆయా గ్రామా లలో ఈజీఎస్ సిబ్బంది పనులను పర్యవేక్షిస్తున్నారు. ఆయా పనులను ఈజిఎస్ ఏపిఓ నవాజుద్దిన్ గురువారం పరిశీలించారు.

## నేటి రాజకీయం

అధికారం నిలబెట్టుకోవడానికి
నానా తంటాలు....
నీతికి ,నిజాయితీకి తిదోలకాలు.

పనికిరానివాడు పాతమిత్రుడు.
దగ్గర ఉన్నవాడు దూరపు బంధువు

రాజకీయానికి లేదు వావి వరస
అందుకే జనాలకు ఇవ్వరు భరోసా

వందేమాతరం చదవని వానికి.
వంగి, వంగి సలాం చేస్తాం.

జనగణమన అనని వానికి.
జై బాయి అంటాం

దేశాన్ని గౌరవించని వాడిని.
దేవరా అంటూ పొగడుతాం

మనలను ఆదుకొని వానికి
అందలం అధికారం ఇస్తాం

ఇదే కదా మన ప్రజాస్వామ్యం.
మనం చూపే దేశాభిమానం



– జి.రంగారావు, మేడ్చల్

# జులై 1 నుంచి కొత్తచట్టాలు

- అమలుకు సంసిద్ధంగా ఉండాలి
- కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి



**కరీంనగర్, ప్రజానావ:** జులై 1వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా నూతన చట్టాలను అమలు కానున్నాయని, వాటిని అమ లు పర్చేందుకు సంసిద్ధంగా ఉండాలని డీజీపీ రవిగుప్తా సూచించారు. గురువారం రాష్ట్రవ్యాప్తంగా సీపీలు, ఎస్పీ లు, అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నూతన చట్టాల అమలుపై పలు కీలక అంశాలను చర్చించారు. ఐపీసీ1860కి బదులుగా 'భార తీయ న్యాయ సంహిత 2023', సీఆర్‌పీసీ 1973కి బదు లుగా 'భారతీయ నాగరిక్ సురక్షసంహిత 2023', ఇండి యన్ ఎవిడన్స్ యాక్ట్ 1872కు బదులుగా 'భారతీయ సాక్ష్య అధినియం 2023' అమలులోకి రానున్నాయని డీజీపీ తెలిపారు. వీసీ అనంతరం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లోని కాన్ఫెరెన్స్ హాల్‌లో సీపీ పలు అంశాలపై అధికారులతో చర్చించారు. జూలై నెల నుంచి జరగబో యే నేరాలకు మారిన చట్టాలకు అనుగుణంగా కేసులు నమోదు చేయాలని సూచించారు. అన్నీ పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలు విధిగా నూతన చట్టాలను అమలు చేయాలని చెప్పారు. అమలు చేయనున్న కొత్త చట్టాలపై ఏర్పడే సందేహాలను నివృత్తి చేసుకుంటూ సరైన సెక్షన్లను ప్రయో గించాలని పేర్కొన్నారు. నేరస్థులు తప్పించుకునేందుకు వీలు లేకుండా భాదితులకు న్యాయం జరిగేలా పకడ్బం దీగా చట్టాలు అమలు చేయాలని సూచించారు. ఈ కార్య క్రమంలో అడిషనల్ డీసీపీ ఏ లక్ష్మీనారాయణ, ఏసీపీలు శ్రీనివాస్, నరేందర్, శ్రీనివాస్‌జీ, విజయకుమార్, కాశ య్యతో పాటు జిల్లాలోని అన్ని విభాగాల ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐ వెల్ఫేర్ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

# రేపటి నుంచి అమర్‌నాథ్ యాత్ర షురూ



**జమ్మూ:** అమర్‌నాథ్ యాత్ర ఈ నెల 29న మొద లవనున్నది. యాత్రకు ముందురోజు అంటే శుక్రవారం మొదటి బ్యాచ్ బేస్ క్యాంప్ భగవతినగర్ జమ్మూ నుంచి బల్తాల్, పహల్గామ్ బయలుదేరి వెళ్లనున్నాయి. ఈ క్రమం లో బుధవారం జమ్ములోని సరస్వతి ధామ్‌లో ఇన్‌స్టంట్ రిజిస్ట్రేషన్ కోసం టోకెన్ల జారీ మొదలైంది. తొలిరోజు బల్తాల్, పహల్గాం నుంచి వెళ్లేందుకు సుమారు 1000 టోకెన్లు జారీ చేశారు. యాత్రికులు తమ పేర్లను నమోదు చేసుకునేందుకు జనం భారీగా తరలివచారు. సరస్వతి ధామ్‌కు తెల్లవారుజామున 4 గంటల నుంచి యాత్రికులు చేరుకొని.. క్యూలైన్లలో బారులు తీరారు. బంగ్లాదేశ్ నుంచి సైతం నలుగురు భక్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని జమ్మూకు చేరుకున్నారు. భద్రతలో ఎలాంటి లోపం లేకుండా చూసేందుకు భద్రతా బలగాలు మార్క్ డ్రిల్ నిర్వహించి, ఏర్పాట్లను పరిశీలించాయి. ఇటీవల ప్రయాణికుల వాహనంపై ఉగ్రదాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో భద్రతా బలగాలను భారీగా మోహ రించారు. డ్రోన్లు, 365 డిగ్రీస్ యాంగిల్ సీసీ కెమెరాల సాయంతో వాహనాల రాకపోకలను పర్యవేక్షిస్తున్నారు. జమ్మూ-శ్రీనగర్ హైవేపై ప్రతి 500 మీటర్లు, కిలోమీటరుకు సెక్యూరిటీ చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఈ 24 గంటలూ సాయు ధ సైనికులను మోహరించి తనిఖీలు చేయనున్నారు. అమర్‌నాథ్ యాత్రకు వెళ్లే వారంతా సాయంత్రం 7గంట ల్లోగా భగవతినగర్‌లోని బేస్ క్యాంప్‌లోకి ప్రవేశించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.

# ముర్ము ప్రసంగంలో కొత్తదనం లేదు

## కొత్త సీసాలో పాత సారాలా ఉంది : అసదుద్దీన్ ఓవైసీ

**న్యూఢిల్లీ:** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంలో కొత్తదనం లేదని, కొత్త సీసాలో పాత సారాలా ఉందని ఏఐఎంఐఎం చీఫ్ అస దుద్దీన్ ఓవైసీ పెదవివిరిచారు. ఆమె ప్రసంగం మొత్తంలో మైనారిటీల సమస్యలు, నిరుద్యోగం ఊసెత్తలేదని ఆరోపించారు.దేశంలో ప్రతిచోటా ప్రశ్నాపత్రాల లీకేజ్ జరుగుతున్నదని ఆందోళ న వ్యక్తం చేశారు. కాషాయ పాలకులు 25 లక్షల యువత జీవితాలతో చెలగాటమాడారని ఆరోపించారు. ఇక అంతకుముందు గురువా రం ఉదయం పార్లమెంట్ ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ 1975లో నాటి ప్రధాని ఇందిరాగాంధీ దేశంలో ఎమర్జెన్సీ విధించారని అన్నారు. ఎమర్జెన్సీ రాజ్యాంగంపై జరిగిన ప్రత్యక్ష దాడి అని పేర్కొన్నారు. దేశ రాజ్యాంగం, ప్రజాస్వామ్యంలో ఎమర్జెన్సీ చీకటి అధ్యాయంగా మిగిలిపో



యిందని అన్నారు. దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, దేశ వ్యాప్తంగా బుల్లెట్ రైళ్లను ప్రవేశపెట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారని చెప్పారు. రాబోయే బడ్జెట్‌లో ప్రజలకు మేలు జరిగే పలు నిర్ణయాలు ఉంటాయనే సంకేతాలు పంపారు.

# భూగోళ సంక్షోభాగ్నికి ఆజ్యం పోస్తున్న శిలాజ ఇంధనాలు!

**ప్రపంచ దేశాలు శిలాజ ఇంధనాల (ఫాజిల్ ఫ్యూయల్స్) వాడకం అనబడే వ్యసనానికి బానిసలు అవుతున్నాయి. తాత్కాలిక, స్వల్పకాలిక ప్రయోజనాలకు ఆశ పడి దీర్ఘకాలిక సంక్షోభాగ్నికి ఆజ్యం పోస్తున్నాయి. ధరిత్రితో పాటు మానవ సమాజ ఆరోగ్యాలను ఫణంగా పెట్టి కోల్, కోల్ ఉత్పత్తులు, సహజ వాయువు, ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తులు, వంట చెరుకు లాంటి శిలాజ ఇంధనాలను వినియోగించడం సాధారణం అయ్యింది. తక్షణమే ప్రపంచ దేశాలు శిలాజ ఇంధనాల వినియోగానికి స్వస్తి పలికి సౌర, పవన, సముద్ర అలల, బయోమాస్, జియోథర్మల్, హైడ్రోజన్, హైడ్రోపవర్ లాంటి పునరుత్పాదక ఇంధనాలను ఆశ్రయించని యెడల సుస్థిర శక్తి భద్రత, శక్తి వినియోగ ధరలు, సర్వతోముఖాభివృద్ధి, ధరణి ఆరోగ్య పరిరక్షణలకు విఘాతం కలుగుతుందని తెలుసుకోవాలి. శిలాజ ఇంధనాల వినియోగం మూలంగా వాతావరణ ప్రతికూల మార్పులతో భూగోళం నిప్పుల కుంపటి కానుంది, అవుతున్నది. సాంప్రదాయ తరిగే శిలాజ ఇంధనాల వాడకాన్ని విశ్వవ్యాప్తంగా తగ్గిస్తూ తరగని సాంప్రదాయేతర పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని పెంచాల్సిన అగత్యం ఏర్పడింది. పునరుత్పాదక ఇంధనాలే 21వ శతాబ్దపు ఆరోగ్య భాగ్యాలను ప్రసాదించే వరాలని భావించాలి. సరసమైన ధరలకు పునరుత్పాదక శక్తిని అందించే స్థితికి చేరినపుడు మాత్రమే భూగోళం జీవుల నివాసయోగ్యతకు అర్హతను కలిగి ఉంటుంది. శిలాజ ఇంధనరూపంలో పొంచి ఉన్న భూతాప ప్రమాదాలను మరిచిన ప్రపంచ దేశాలు నేటికీ వాటి వాడకం మీదనే అతిగా ఆధారపడి ఉంటున్నాయి.**



### శిలాజ ఇంధనాల దుష్ప్రభావం:

రోమ్ తగలపడుతున్న వేళ నీరో ఫిడేలు వాయించినట్లు భూవాతావరణం వేడెక్కుతున్న వేళ పలు దేశాధినేతలు అనాలోచితంగా శిలాజ ఇంధనాల వినియోగానికి ఉవ్విలూరుతున్నారు. రష్యా - ఉక్రెయిన్, ఇజ్రాయిల్ - పాలస్తీనా యుద్ధాలతో వాతావరణ మార్పులు తీవ్ర సమస్యగా మారుతున్నాయి. ప్రపంచదేశాలు శిలాజ ఇంధనాల సరఫరాలో ప్రతి నిమిషం 11 బిలియన్ల అమెరికన్ డాలర్ల సబ్సిడీలను భరిస్తున్నాయి. శిలాజ ఇంధన వినియోగం ఇలాగే కొనసాగితే అకాల వర్షాలు, వరదలు, కరువుకాటకాలు, కార్చిచ్చులు, అసాధారణ అనారోగ్య కారణ ఉష్ణోగ్రతలు లాంటి ప్రకృతి విపత్తులు సాధారణం కానున్నాయి. దీనికి తోడుగా జీవవైవిధ్య సమస్యతో జీవకోటి మనుగడ ప్రశ్నార్థకం కానున్నాయి. నేడు భూగోళం వాతావరణ ప్రతికూల మార్పుల కల్లోలం ఉంది. శిలాజ ఇంధనాలతో వాతావరణ మార్పుల సంక్షోభం అంచున ప్రపంచ ప్రాణికోటి నిలబడి ఉంది. ఈ ప్రతికూల మార్పులకు అతీతులెవరూ లేరు. అన్ని జీవరాశులతో పాటు ప్రపంచ మానవ సమాజం ఈ భూగోళ మంటల్ని భరించాల్సిందే, తగు శాపాలను అనుభవించాల్సిందే.

### ప్రస్తుత కర్తవ్యం ఏమిటి !

ప్రపంచ దేశాలు 2030 నాటికి క్రమంగా శిలాజ ఇంధనాల వినియోగాలను, వాటికి సంబంధించిన మౌళిక వసతులను తగ్గిస్తూనే పునరుత్పాదక తరగని ఇంధనాల వినియోగాలను, పెట్టుబడులను, ఉత్పత్తులను పెంచాల్సిన అనివార్యత ఏర్పడింది. జీ-20 దేశాల ప్రభుత్వాలతో పాటు ఓఈసిడి దేశాలు ఈ దిశగా వడివడిగా అడుగులు వేయాల్సి ఉంది. పునరుత్పాదక ఇంధనాలకు సంబంధించిన సాంకేతికతలను, టెక్నాలజీ మార్పుల ప్రతిబంధకాలైన మేధో హక్కులను సడలించడం సత్వరమే జరగాలి. తరగని సాంప్రదాయేతర ఇంధన టెక్నాలజీ ఉపకరణాలను, ముడి సరుకుల సరఫరా శృంఖలాలను ప్రపంచ దేశాల మధ్య నెలకొల్పాల్సి ఉంటుంది. 2020 నాటికే అందుబాటులోకి వచ్చిన 5 గిగావాట్ల బ్యాటరీ స్టోరేజ్ సామర్థ్యాలను 2030 నాటికి అనేక గిగావాట్ల నిలువ సామర్థ్యాలకు పెంచాల్సి ఉంది. శిలాజ ఇంధనాలకు వెచ్చించే నిధులను తరగని ఇంధనాల అభివృద్ధికి, ఉత్పత్తికి వినియోగించుకోవలసి ఉంటుంది. సౌర, పవన శక్తి ఉత్పత్తికి సంబంధించిన ప్రభుత్వ అనుమతులు వేగంగా, సులభంగా అందుబాటులోకి రావాలి. పునరుత్పాదక శక్తి ఉత్పత్తులను కనీసం 3 రెట్లు పెంచడానికి ప్రణాళికలు అమలు చేయాలి. సాంప్రదాయేతర ఇంధనాల ఉత్పత్తి పరిశ్రమలు నెలకొల్పడానికి తక్కువ వడ్డీతో బ్యాంకు రుణాలు వితరణ చేసేలా యాంత్రాంగాలను సమాయత్తం చేయాలి.

వాతావరణ ప్రతికూల మార్పులతో ఉష్ణోగ్రతలు 1.5 డిగ్రీలు పెరిగితే భూగోళం నివాసయోగ్యతలను కోల్పోతుందని మరువరాదు. 2030 నాటికి 40 శాతం కార్బన్ ఉద్గారకాలను తగ్గించడంతో పాటు 2050 నాటికి జీరో కార్బన్ ఉద్గార స్థాయికి చేరుకునేలా స్థిరమైన అడుగులు పడాలి. పునరుత్పాదక శక్తి విప్లవం మానవాళి మనుగడకు గొడుగులు పట్టనున్నది. పునరుత్పాదక శక్తి ఉత్పత్తి పరిశ్రమలు లక్షల ఉద్యోగాలను ఇవ్వనున్నాయి. అడవుల నరుకువేత, భూసారం తగ్గడం లాంటి ప్రధాన అంశాలు కూడా భూతాపానికి దోహదపడుతున్నాయని మనకు తెలుసు. చేతులు కాలక ముందే ఆకులు సిద్ధం చేసుకుంటూ, దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకుంటూ భూమాతను ఓ అద్భుత నివాసయోగ్య ఆలయంగా మార్చుకుందాం. శిలాజ ఇంధనాలకు క్రమంగా చరమగీతం పాడుదాం.



**డా: బుర్ర మధుసూదన్‌రెడ్డి**
**9949700037**

# తల్లి తీర్పు..

- **కూతురితో భర్త అసభ్య ప్రవర్తన**
- **గొడ్డలితో నరికి చంపిన భార్య**

**ఆంథోల్, ప్రజానావ:** కూతురితో అసభ్యంగా ప్రవర్తించిన భర్తను భార్య దారుణంగా హత మార్చింది. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా చౌటకుర్ మండలం సుల్తాన్‌పూర్‌లో బుధవారం అర్ధరాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే.. సుల్తాన్‌పూర్‌కు చెందిన మన్నే మానయ్య(45) ఇందిరా దంపతులకు సుకన్య అనే కూతురు ఉంది. ఏడాది క్రితం సుకన్య భర్త చనిపోవడంతో తల్లిదండ్రుల వద్దే ఉంటున్నది. మద్యానికి బానిసైన మానయ్య తన ఇంట్లో ఉంటున్న కూతురిపై కన్నేశాడు. ఆమెతో అస భ్యంగా ప్రవర్తించడం మొదలు పెట్టాడు. ఈ క్రమం లో బుధవారం అర్ధరాత్రి దాకా తాగి వచ్చి భార్య, కూతురితో గొడవకు దిగాడు. కూతురితో అసభ్యంగా ప్రవర్తించాడు. గొడ్డలి తీసుకొని సుకన్యను బెదిరిస్తూ దాడికి పాల్పడ్డాడు. అక్కడే ఉన్న ఇందిరా అతనిని అడ్డుకొని, కూతురిని లోనికి వెళ్లాలని చెప్పింది. మానయ్య చేతిలో ఉన్న గొడ్డలిని లాక్కొని, అతనిని నరికి చంపింది. అర్ధరాత్రి విషయం తెలుసుకున్న జోగిపేట సీఐ అనిల్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోస్టుమార్టం కోసం శవాన్ని సంగారెడ్డి దవాఖానకు తరలించారు. ఉదయం క్లూస్‌టీమ్ మా నయ్య ఇంట్లో శాంపిల్స్ సేకరించింది. కేసు నమోదు చేసుకున్నట్టు సీఐ తెలిపారు.

## ఆ క్రెడిట్ కార్డు వినియోగదారులకు

# అదిరిపోయే న్యూస్!


**ముంబై:** భారతదేశంలో బ్యాంకింగ్ రంగంలో వస్తున్న మార్పులు కారణంగా రోజురోజుకూ క్రెడిట్ కార్డుల వినియోగదారులు బాగా పెరుగుతున్నారు. ఈ నేపథ్యంలో చాలా బ్యాంకులు తమ వినియోగదారులకు అర్హతను బట్టి క్రెడిట్ కార్డులను ఇస్తున్నాయి. ఒక్కో వినియోగదారుడికి రెండు నుంచి మూడు బ్యాంకుల క్రెడిట్ కార్డులు ఉంటున్నాయంటే వీటి వినియోగం మనం అర్థం చేసుకోవచ్చు. అయితే బ్యాంకులు మారుతున్న రూల్స్ ప్రకారం ఎప్పటికప్పుడు బ్యాంకింగ్ రూల్స్ కూడా మారుస్తాయి. తాజాగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టాటా నియో ఇన్ఫినిటీ, టాటా నియో ప్లస్ క్రెడిట్ కార్డ్ రూల్స్ తాజాగా మార్చాయి. ఈ నయా రూల్స్ ఆగస్ట్ 1, 2024 నుంచి అమలులోకి వస్తాయి. ముఖ్యంగా యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) చెల్లింపుల కోసం ఈ కార్డ్‌లను ఉపయోగించే కస్టమర్‌లు క్యాష్‌బ్యాక్ స్ట్రక్చర్‌లో సర్దుబాట్లను చేశారు. ఇదే విషయాన్ని ఈ-మెయిల్ నోటిఫికేషన్‌ల ద్వారా తెలియజేశారు. వినియోగదారులు టాటా నియో యూపీఐ ఐడీను ఉపయోగించి చేసిన అర్హత ఉన్న లావాదేవీలపై 1.5 శాతం నియో కాయిన్స్‌ను రివార్డ్‌లుగా అందుకుంటారు. పేటీఎం, ఫోన్ పే, క్రెడ్ వంటి ఇతర అర్హత ఉన్న యూపీఐ ఐడీల %×ణ%ల ద్వారా చేసే లావాదేవీలు 0.50 శాతం నియో కాయిన్స్‌ను పొందవచ్చు. అదేవిధంగా టాటా నియో ప్లస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్రెడిట్ కార్డ్ హోల్డర్‌లు టాటా నియో యూపీఐ ఐడీను ఉపయోగించి అర్హత ఉన్న యూపీఐ లావాదేవీలపై 1 శాతం నియో కాయిన్స్, ఇతర అర్హత కలిగిన యూపీఐ ఐడీలను ఉపయోగించే లావాదేవీలపై 0.25 శాతం నియో కాయిన్స్‌ను పొందవచ్చు. ఈ మార్పులు కాకుండా టాటా నియో ఇన్ఫినిటీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్రెడిట్ కార్డు అదనపు ప్రోత్సాహకాలను అందిస్తుంది. వినియోగదారులు టాటా నియో యాప్ ద్వారా ఈఎంఐయేతర ఖర్చుల కోసం 10 శాతం నియో కాయిన్స్‌ను సంపాదించవచ్చు. అయితే భాగస్వామి టాటా బ్రాండ్‌లలో ఖర్చు చేస్తే 5 శాతం నియో కాయిన్స్ లభిస్తాయి. నాన్-టాటా బ్రాండ్ ఖర్చులు లేదా వ్యాపారి ఈఎంఐ ఖర్చులు 1.5 శాతం నియో కాయిన్స్‌తో రివార్డ్ వస్తాయి. అలాగే టాటా నియో ప్లస్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్రెడిట్ కార్డ్ వినియోగదారులకు టాటా న్యూ యాప్ ద్వారా ఈఎంఐ కాని ఖర్చులకు 7 శాతం నియో కాయిన్స్, భాగస్వామి టాటా బ్రాండ్‌లలో ఖర్చు చేసినందుకు 2 శాతం నియో కాయిన్స్‌ను అందిస్తుంది. టాటా నియో యాప్ ద్వారా రీఛార్జ్‌లు, బిల్లు చెల్లింపులు కూడా 2 శాతం నియో కాయిన్స్‌ను పొందుతాయి. రుసుములకు సంబంధించి టాటా న్యూ ఇన్ఫినిటీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్రెడిట్ కార్డ్‌లో చేరడం/పునరుద్ధరణ రుసుము రూ.1,499, వార్షికంగా రూ.3 లక్షలు ఖర్చు చేయడంపై వార్షిక రుసుము మినహాయింపు ఉంటుంది. మరోవైపు టాటా నియో ప్లస్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్రెడిట్ కార్డ్‌లో చేరడం/పునరుద్ధరణ రుసుము రూ.499. అయితే వార్షికంగా రూ. లక్ష ఖర్చు చేస్తే వార్షిక రుసుము మినహాయింపు లభిస్తుంది.




# జియో యూజర్లకు బిగ్ షాక్

## రీఛార్జ్ ప్లాన్ ధరలు పెంపు

**ముంబై:** లోక్‌సభ ఎన్నికల అనంతరం మొబైల్ రీఛార్జ్ టారిఫ్ ధరలు పెరుగుతాయని మొదట్లోనే ఊహాగానాలు వినిపించాయి. ఇప్పుడు అదే జరిగింది. టెలికం దిగ్గజాల్లో అగ్రగామి అయిన రిలయన్స్ జియో తమ యూజర్లకు గట్టి షాక్ ఇచ్చింది. ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ జియో టారిఫ్ ధరలను భారీగా పెంచుతున్నట్టుగా ప్రకటించింది. ఇప్పటికే ఉన్న జనాదరణ పొందిన ప్లాన్‌లు కొంచెం ఖరీదైనవిగా ఉన్నాయి. కొత్త ప్లాన్‌లు జూలై 3, 2024 నుంచి అమలులోకి వస్తాయి. 12.5 శాతం నుంచి అత్యధిక స్థాయిలో 25 శాతం వరకు మొబైల్ రీఛార్జ్ టారిఫ్ రేట్లు పెరగనున్నాయని కంపెనీ ఒక పత్రిక ప్రకటనలో పేర్కొంది. తద్వారా జియో కస్టమర్లపై ప్రభావం పడనుంది. అంతేకాదు.. జియో కొత్త రీఛార్జ్ ప్లాన్లతో పాటు 5జీ అన్‌లిమిటెడ్ ప్లాన్లను కూడా ప్రవేశపెట్టింది. కొత్తగా సవరించిన రీఛార్జ్ ప్లాన్లు ఈరోజు నుంచి అమల్లోకి వస్తాయని వెల్లడించింది. జియో బేస్ రూ. 155 ప్లాన్ తాజా పెంపుతో రూ. 189కి పెరిగింది. అంటే.. దాదాపు 22శాతం పెరిగింది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. మరో టెలికం పోటీదారు అయిన భారతీ ఎయిర్‌టెల్ కన్నా ముందే ఈ పెంపును జియో ప్రకటించింది. టెల్కో 19 ప్లాన్‌లకు టారిఫ్ పెంపుదల ప్రకటించింది. ఇందులో 17 ప్రీపెయిడ్ ప్లాన్‌లు, 2 పోస్ట్‌పెయిడ్ ఆప్షన్లు ఉన్నాయి.




### జియో ప్లాన్ వివరాలను పరిశీలించినట్లతే..

బేస్ ఆఫర్ అయిన రూ. 155 ప్లాన్ ఇప్పుడు రూ. 189 అవుతుంది. అదే 28 రోజుల వ్యాలిడిటీని అందిస్తుంది. రూ.209 ప్లాన్ ఇప్పుడు రూ.249 అవుతుంది. అదే 28 రోజులు వ్యాలిడిటీని అందిస్తుంది. ఈ ప్లాన్‌ల డేటా ప్రయోజనాలు అలాగే ఉంటాయి. అందులో ఎలాంటి మార్పు ఉండదు. అన్‌లిమిటెడ్ 5జీ డేటాను అందించే రూ. 239 ప్లాన్ ఇకపై అలా ఉండదు. రూ.239 ప్లాన్ ఇప్పుడు రూ.299 అవుతుంది. 28 రోజుల పాటు వ్యాలిడిటీని అందిస్తుంది. ఇప్పుడు అన్‌లిమిటెడ్ 5జీ డేటా రోజుకు 2జీబీ డేటా, అంతకంటే ఎక్కువ ఉన్న ప్లాన్‌లలో మాత్రమే అం దుబాటులో ఉంటుందని గమనించండి. కొత్త ప్లాన్‌లు జూలై 3, 2024 నుంచి అమలులోకి వస్తాయి. టారిఫ్ పెంపుతో పాటు జియో జియోసేఫ్, జియో ట్రాన్స్‌లేట్ ప్రకటించింది. జియోసేఫ్ అనేది కాలింగ్, మెసేజింగ్, ఫైల్ ట్రాన్స్‌ఫర్ మరిన్నింటికి క్వాంటం-సెక్యూర్ కమ్యూనికేషన్ యాప్, నెలకు రూ.199కి అందుబాటులో ఉంటుంది. జియోట్రా న్స్‌లేట్ అనేది నెలకు రూ. 99కి వాయిస్ కాల్, వాయిస్ మెసేజ్, టెక్స్ట్, ఇమేజ్‌లను ట్రాన్స్‌లేట్ చేయడానికి మల్టీ లాంగ్వేజీ కమ్యూనికేషన్ యాప్ అందిస్తుంది. జియో వినియోగదారులు నెలకు రూ. 298 విలువైన ఈ రెండు అప్లికేషన్‌లను ఒక ఏడాది పాటు పూర్తిగా ఉచితంగా పొందుతారని ప్రకటించింది.

# విజువల్ వండర్‌గా కల్కి 2898 ఏడీ

## భారతీయ సినిమాకు మరో ఆణిముత్యం

**బాహుబలి చిత్రాల తర్వాత ప్రభాస్ పూర్తిగా పాన్ ఇండియా హీరో అయిపోయారు. అందుకు తగినట్లే ఆయన ఎంచుకునే కథలు ఉంటున్నాయి. నాగ్ అశ్విన్, ప్రభాస్ కాంబినేషన్‌లో సినిమా అంటే అంచనాలు భారీగానే ఉంటాయి. అందుకు తగినట్లుగానే ఓ పాన్ వరల్డ్ స్జబెక్ట్‌ను ఎంచుకుని పురాణాలను ముడిపెడుతూ 'కల్కి 2898 ఏడీ'తో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. భారీ బడ్జెట్, నాలుగేళ్ల నిర్మాణం, అమితాబ్, కమల్ వంటి అగ్ర తారాగణం నటించడంతో యావత్ భారతీయ సినీ పరిశ్రమ దృష్టిని ఆకర్షించింది.**




కురుక్షేత్రం తర్వాత ఆరు వేల ఏళ్లకు మొదలయ్యే కథ ఇది. భూమిపై తొలి నగరంగా పురాణాలు చెబుతున్న కాశీ, అప్పటికి చివరి నగరంగా మిగిలి ఉంటుంది. భూమిపై ఉన్న అన్ని వనరులను పీల్చేసి స్వర్గంలాంటి కాంప్లెక్స్‌ని నిర్మించి పాలిస్తుంటాడు సుప్రీం యాస్కిన్ (కమల్‌హాసన్). కాశీలో బౌంటీ ఫైటర్ అయిన భైరవ (ప్రభాస్) యూనిట్స్‌ని సంపాదించి కాంప్లెక్స్‌కి వెళ్లి అక్కడ స్థిరపడిపోవాలనే ప్రయత్నాల్లో ఉంటాడు. సుప్రీం యాస్కిన్ తలపెట్టిన ప్రాజెక్ట్‌కె కోసం, కాంప్లెక్స్ సైన్యం కాశీకి వచ్చి గర్భం దాల్చే అవకాశాలున్న అమ్మాయిల్ని కొనుగోలు చేసుకుని వెళుతూ ఉంటుంది. అలా ఎంతోమంది అమ్మాయిల్ని ప్రాజెక్ట్‌-కె కోసం గర్భవతుల్ని చేసి, వారి నుంచి సీరమ్ సేకరిస్తూ ప్రయోగాలు చేపడుతుంటారు. అలా సుమతి (దీపికా పదుకొణె) కాంప్లెక్స్‌లో చిక్కుకుపోయి గర్భం దాలుస్తుంది. మరోవైపు రేపటి కోసం అంటూ శంబల ప్రజలు ఎన్నో త్యాగాలు చేస్తూ ఓ తల్లి కోసం ఎదురు చూస్తుంటారు. ఆ తల్లి సుమతి అని నమ్ముతారు. మరి ఆమెని కాంప్లెక్స్ ప్రయోగాల నుంచి ఎవరు కాపాడారు? చిరంజీవి అయిన అశ్వత్థామకీ, భైరవకీ సంబంధం ఏమిటి?సుప్రీం యాస్కిన్ ప్రాజెక్ట్ – కె లక్ష్యమేమిటి ..అన్నదే కథ.. హాలీవుడ్ చిత్రాలు చూస్తున్నప్పుడు మనం ఇలాంటి సినిమాలు తీయలేమా? ఇలా ప్రపంచం మొత్తాన్ని కూర్చోబెట్టి మన కథలు చెప్పలేమా? అనే ప్రశ్నలు తలెత్తుతూ ఉంటాయి. ఆ ప్రయత్నాన్ని విజయవంతంగా మనదైన కథతో చేసి చూపించారు దర్శకుడు నాగ్ అశ్విన్. కళ్లు చెదిరే విజువల్స్, లీనం చేసే కథ, బలమైన పాత్రలతో మన రేపటి సినిమా కోసం బాటలు వేశాడు. హాలీవుడ్ సినిమాల స్ఫూర్తితో కూడిన పాత్రలు, కల్పిత ప్రపంచాలు ఈ సినిమాలో కనిపించినప్పటికీ, వాటికి మన పురాణాల్ని మేళవిస్తూ కథ చెప్పిన తీరు అబ్బుర పరుస్తుంది.కురుక్షేత్ర సంగ్రామం సన్నివేశాలతో సినిమా ప్రారంభమవుతుంది. కథా ప్రపంచాన్ని, పాత్రల్ని పరిచయం చేస్తూ మెల్లగా అసలు కథలోకి తీసుకెళుతుంది సినిమా. ప్రభాస్ కూడా ఆలస్యంగానే తెరపైకొస్తాడు. నీటి జాడ లేని భవిష్యత్తు కాశీ నగరం, ఆక్సిజన్ కోసం, ఆహారం కోసం తల్లడిల్లే ప్రజలు, కాంప్లెక్స్ దురాగతాలు కథలో లీనం చేస్తాయి. నాగ్ అశ్విన్ ఇందులో హీరోయిజం కంటే కూడా, కథకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తూ సన్నివేశాల్ని మలచడం విశేషం. కథలోని మూడు ప్రపంచాలు వేటికదే భిన్నంగా ఉండేలా ఆవిష్కరించిన తీరు కట్టి పడేస్తుంది. ప్రథమార్థంలో అక్కడక్కడా సన్నివేశాల్లో కొంత వేగం తగ్గినట్టు అనిపించినా ప్రభాస్, అమితాబ్ బచ్చన్ మధ్య సన్నివేశాలు మొదలైనప్పటి నుంచి తర్వాత ఏం జరుగుతుందనే ఉత్సుకత మొదలవుతుంది. చిన్న పిల్లలు సైతం ఇష్టపడేలా ప్రభాస్ పాత్ర కామిక్ టచ్‌తో సాగుతుంది. భారతీయ పురాణాల్లోని సూపర్‌హీరోలు ఎలా ఉంటారో మచ్చుకు కొంచెం చాటేలా ఉంటాయి ఆ సన్నివేశాలు. రెండో భాగం సినిమా కథ భైరవ యాస్కిన్‌తో ఉంటుందనే సంకేతాలతో తొలి భాగం కథ ముగుస్తుంది. వెండితెరపై ఓ కొత్త ప్రపంచాన్ని తెరపై ఆవిష్కరించడంలో దర్శకనిర్మాతలు, సాంకేతిక బృందం విజయవంతమైంది. భారతీయ సినిమాని మరో మెట్టు ఎక్కించిన సినిమాగా ఇది నిలుస్తుంది. ప్రభాస్ తన కటౌట్‌కి తగ్గ పాత్రలో ఒదిగిపోయారు. కథే ప్రధానంగా సాగే సినిమా కావడంతో ప్రభాస్‌తో పాటు ఇతర పాత్రలూ బలంగా కనిపిస్తాయి. కొన్నిసార్లు కథంతా అమితాబ్ బచ్చన్, దీపికా పదుకొణె చుట్టూనే సాగుతున్నట్టు అనిపిస్తుంది. అమితాబ్ బచ్చన్ ఇమేజ్, ఆయన నటన ఈ సినిమాకి బాగా ఉపయోగపడింది. ఈ వయసులోనూ ఆయన పోరాట ఘట్టాలు చేసిన తీరు ప్రేక్షకుల్ని కట్టి పడేస్తుంది. బాహుబలి ప్రభాస్ కటౌట్‌కి దీటుగా కనిపించే పాత్రలో మరొకరిని ఊహించలేని విధంగా అమితాబ్ బచ్చన్ నటించారు. డీగ్లామరస్‌గానే అయినా దీపికా పదుకొణె బలమైన పాత్రలో కనిపిస్తుంది. దిశా పటానీ పాత్ర అలా మెరిసి, ఇలా మాయమైపోతుంది. శోభన, అన్నాబెన్, పశుపతి, మానస్ పాత్రలో స్వాస్థ ఛటర్జీ తదితరులు పోషించిన పాత్రల పరిధి తక్కువే అయినా ప్రభావం చూపించారు. బ్రహ్మానందం, ప్రభాస్‌తో కలిసి కొన్ని నవ్వులు పంచారు. సుప్రీమ్ యాస్కిన్‌గా విలన్ పాత్రలో కమల్‌హాసన్ కనిపిస్తారు. ఆయన గెటప్ భయపెట్టేలా ఉంటుంది. ఇందులో ఆ పాత్ర పరిధి తక్కువే అయినా, పరిచయం చేసిన తీరు, మంచితనం ఎలా మారుతుందో చెప్పే కొన్ని మాటలు ఆలోచింపజేస్తాయి. రెండో భాగంలో మాత్రం భూకంపమే అని సంకేతాలిచ్చారు. మరోవైపు మూడు గంటలు నిడివి ఉన్నా సినిమా అలా సాగిపోతూ ఉండటానికి కారణం అతిథి పాత్రలు. అవి కనిపించిన ప్రతిసారీ థియేటర్‌లో ఓ జోష్ వస్తుంది. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన పేర్లు రామ్‌గోపాల్ వర్మ, రాజమౌళి, విజయ్ దేవరకొండ, మృణాళ్ ఠాకూర్, దుల్కర్ సల్మాన్ తదితర పాత్రలు కథానుసారం ప్రవేశపెట్టిన తీరు అలరిస్తుంది. సాంకేతికంగా సినిమా ఉన్నతంగా ఉంది. సంతోష్‌నారాయణ్ నేపథ్య సంగీతం, జోర్డే కెమెరా పనితనం చిత్రానికి ప్రధానబలం. ప్రొడక్షన్ డిజైన్, విజువల్ ఎఫెక్ట్స్ సినిమాని మరోస్థాయిలో నిలబెట్టాయి. దర్శకుడు నాగ్ అశ్విన్ విజువలైజేషన్, ఆయన చెప్పిన కథ మనసుల్ని హత్తుకుంటుంది.

## కల్కి భారీ విజయంపై లోకేశ్ అభినందన

### దర్శకునికి నాని, మంచు మనోజ్‌ల కితాబు

'కల్కి' సినిమా బ్లాక్‌బస్టర్ టాక్‌ను సొంతం చేసుకుంది. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ తెరకెక్కించిన ఈ భారీ బడ్జెట్ సినిమా హిట్ కావడంతో సినీ, రాజకీయ ప్రముఖులు ప్రశంసలు కురిపిస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా మూవీ టీమ్‌కు శుభాకాంక్షలు చెబుతున్నారు. తాజాగా ఏపీ ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ 'కల్కి' టీమ్‌ను అభినందిస్తూ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. సినిమాకు వస్తోన్న అద్భుతమైన రివ్యూలు వినడం చాలా సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రభాస్, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొణెలకు అభినందనలు తెలిపారు. గొప్ప సినిమాను తెరకెక్కించారంటూ నాగ్ అశ్విన్‌కు ధన్యవాదాలు చెప్పారు. తెలుగు సినిమాను గ్లోబల్ స్థాయికి తీసుకువెళ్లేందుకు కృషి చేశారంటూ నిర్మాతలకు శుభాకాంక్షలు తెలిపారు. అంతర్జాతీయ స్థాయి చిత్రం. పురాణాలకు సైన్స్‌ను ముడిపెట్టి తీసిన మాస్ ఇండియన్ ఫిల్మ్.. తెలుగు ల్యాండ్ నుంచి చూస్తారా? అయితే 'కల్కి 2898 ఏడీ'ని చూడండి. నాగ్ అశ్విన్, ప్రభాస్ అన్న, వైజయంతీ మూవీస్‌తో పాటు చిత్రబృందం అందరికీ శుభాకాంక్షలు. ఎంతో గర్వంగా ఉందని నటుడు నాని కితాబునిచ్చారు. నలుమూలల నుంచి బ్లాక్‌బస్టర్ టాక్ వినిపిస్తోంది. టీమ్‌కు శుభాకాంక్షలు. నాగ్ అశ్విన్ విజన్‌కు హ్యాట్సాఫ్. నిర్మాత దూరదృష్టి, అంకితభావం ఈ పురాణకథకు ప్రాణం పోశాయి. భారతీయ సినీ రంగంలో 'కల్కి' ఓ మైలురాయి అంటూ మంచు మనోజ్ అబినందించారు.

## గేమ్ ఛేంజర్‌ను త్వరగా పూర్తి చేస్తా : శంకర్



రామ్‌చరణ్ – శంకర్‌ల కాంబోలో తెరకెక్కుతోన్న సినిమా 'గేమ్ ఛేంజర్' చిత్రం నుంచి అప్‌డేట్ వచ్చి చాలా రోజులవుతోంది. తాజాగా దర్శకుడు శంకర్ దీనిపై అప్‌డేట్ ఇచ్చారు. 'ఇండియన్ 2' ప్రమోషన్‌లో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో 'గేమ్ ఛేంజర్' గురించి మాట్లాడారు. సినిమా షూటింగ్ దాదాపు పూర్తయింది. ఇంకా 10 రోజుల చిత్రీకరణ మాత్రమే మిగిలిఉంది. 'ఇండియన్ 2' రిలీజ్ కాగానే 'గేమ్ ఛేంజర్' ప్రొడక్షన్ పనులు పూర్తి చేస్తాను. ఆ తర్వాత ఫైనల్ ఫుటేజ్ చూసి పోస్ట్ ప్రొడక్షన్ పనులు ప్రారంభిస్తాను. అన్ని పనులు పూర్తయిన తర్వాత రిలీజ్‌పై ఓ నిర్ణయం తీసుకుంటా. సాధ్యమైనంతవరకు త్వరగానే రిలీజ్ చేయడానికి ప్రయత్నిస్తా' అని శంకర్ చెప్పారు. అలాగే హీరో సిద్దార్థ్ మాట్లాడుతూ.. శంకర్ ఓ సినిమాలో 2000 మందితో సన్నివేశాలు చిత్రీకరించారు. అవి అద్భుతంగా ఉన్నాయని అన్నారు. దీంతో సిద్దార్థ్ చెప్పింది 'గేమ్ ఛేంజర్' గురించేనని రామ్‌చరణ్ అభిమానులు భావిస్తున్నారు. ఇక ఈ సినిమా విషయానికొస్తే.. పొలిటికల్, యాక్షన్ నేపథ్యంలో సాగే పవర్‌ఫుల్ కథాంశంతో సిద్ధమవుతోంది. ఇందులో రామ్ చరణ్ ద్విపాత్రాభినయంలో కనిపించనున్నట్లు సమాచారం. కియారా అద్వాణీ హీరోయిన్‌గా కనిపించనుండగా.. అంజలి, శ్రీకాంత్, సునీల్, ఎస్.జె.సూర్య, సముద్రఖని, నవీన్ చంద్ర తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు.

## నిఖిల్ స్వయంభూలో కీలక సన్నివేశాల చిత్రీకరణ

నిఖిల్ మోస్ట్ ఎవైటెడ్ పాన్-ఇండియా ప్రాజెక్ట్ 'స్వయంభూ మారేడుమిల్లిలోని బ్యూటీఫుల్ లోకేషన్స్ లో కొత్త షూటింగ్ షెడ్యూల్ ప్రారంభమైంది. మారేడుమిల్లిలోని దట్టమైన అడవులలో నిఖిల్ పై కొన్ని కీలక సన్నివేశాలను ఈ షెడ్యూల్ లో చిత్రీకరిస్తున్నారు. నిఖిల్ హీరోగా 20వ చిత్రంగా పీరియాడికల్ జానర్‌లో రూపొందుతున్న ఈ సినిమా ఆయన కెరీర్‌లో మైల్ స్టోన్ మూవీగా ఉండేలా దర్శకుడు భరత్ కృష్ణమాచారి తెరకెక్కిస్తున్నాడు. ఠాగూర్ మధు సమర్పణలో పిక్సెల్ స్టూడియోస్ పతాకంపై భువన్, శ్రీకర్ ఈ 'స్వయంభూస చిత్రాన్ని అత్యున్నత ప్రొడక్షన్ వాల్యూస్, టెక్నికల్ స్టాండర్డ్స్ తో నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో నిఖిల్ లెజెండరీ వారియర్ పాత్రను పోషిస్తుండగా ఆ పాత్ర కోసం ఆయన ప్రత్యేక శిక్షణ కూడా తీసుకోవడం విశేషం. సంయుక్త , నభా నటేష్ హీరోయిన్స్ గా నటిస్తుండగా రవి బస్రూర్ సంగీతం, కెకె సెంథిల్ కుమార్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ఎం ప్రభాకరన్ ప్రొడక్షన్ డిజైనర్‌గా చేస్తున్నారు.




## విజయ్ సరసన జాన్వీకపూర్

### కోలీవుడ్‌లో జోరుగా ప్రచారం



అగ్రనటుడు విజయ్ సరసన బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ నటించనుందనే వార్త కోలీవుడ్‌లో హల్చల్ చేస్తుంది. ప్రస్తుతం విజయ్ 'ది గోట్' చిత్రంలో నటించారు. ఆ తర్వాత హెచ్. వినోద్ దర్శకత్వంలో విజయ్ తన 69 వ చిత్రంలో నటించనున్నారు. ఇందులో పలువురు హీరోయిన్ల పేర్లను పరిశీలించినప్పటికీ చివరకు జాన్వీ కపూర్‌ను ఎంపిక చేసినట్టు వార్తలు వస్తున్నాయి. ఇటీవలకాలంలో జాన్వీ కపూర్ ఎక్కువగా ముంబై టు చెన్నై మధ్య చక్కర్లు కొడుతున్నారు. చెన్నైతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోని పుణ్యస్థలాలను సందర్శిస్తోంది. అయితే, తన తల్లి శ్రీదేవి నిలదొక్కుకున్న తమిళంలో తాను ఎంట్రీ ఇచ్చేందుకు ఆమె ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో తన కుమార్తె కోర్కెను తీర్చేందుకు ఆమె తండ్రి, బాలీవుడ్ నిర్మాత బోనీ కపూర్ ముందుకు వచ్చారు. విజయ్ 69వ చిత్రంలో కుమార్తెకు అవకాశం ఇప్పించేందుకు తన వంతు ప్రయత్నాలు మొదలుపెట్టారు. దీనికి కారణం లేకపోలేదు. హెచ్. వినోద్ (ఊ ÷ఎతినినీట) దర్శకత్వంలో అజిత్ హీరోగా నటించిన 'వలిమై', 'తుణివు' చిత్రాలను బోనీ కపూర్ నిర్మించారు. దీంతో దర్శకుడు హెచ్. వినోద్ – బోనీ కపూర్ మధ్య మంచి సత్సంబంధాలు ఉండటంతో విజయ్ చిత్రంలో జాన్వీ కపూర్‌ను హీరోయిన్‌గా నటింపజేసేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారని టాక్ వినిపిస్తుంది. మరో వైపు జాన్వీ కపూర్ ఇప్పటికే సౌత్‌లో తన సత్తా చాటేందుకు సిద్ధమైంది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ 'దేవర సినిమాలోనూ.. అలాగే గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ , బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో తెరకెక్కనున్న ఖీఅ16 చిత్రంలోనూ ఆమె అవకాశం సొంతం చేసుకుంది. 'దేవర' చిత్రం రెండు పార్ట్‌లుగా రానుంది కాబట్టి.. జాన్వీలో సౌత్‌లో మూడు సినిమాలు చేస్తున్నట్లుగా చెప్పుకోవచ్చు. ఇప్పుడు విజయ్ సినిమాలో కూడా ఆమెకు అవకాశం వచ్చినట్లుగానే టాక్ వినబడుతోంది. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

## ఉద్యోగ, ఉపాధి

# రంగాల నిర్వీర్యం

### ప్రజల ఆర్థికస్థితిపై ధరలపోటు




**న్యూఢిల్లీ, జూన్ 27 :** ఇప్పటికే రెండుకోట్ల మందికి ఉపాధి గల్లంతయ్యిందన్న వార్తలు వస్తున్నా అది అంతకు మించి ఉంటుందని అంటున్నారు. దేశంలో నిరుద్యోగానికి తోడు, ఉపాధి అవకాశాలు మందగిస్తున్నాయి. మరోవైపు వస్తూత్పత్తి పెరిగినా.. ధరల పోటు తప్పడంలేదు. ఉపాధి దొరక్క నేటికీ వేలాదిమంది విదేశాల బాటు పడుతున్నారు. ఆర్థిక పునరుత్తేజానికి, వృద్ధిరేటును పెంచడానికి నవతరం సంస్కరణలు అవసరమని తెలిపా రు. విద్యుత్తు, బ్యాంకింగేతర ఆర్థికసంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల రంగాల సమస్యలు సత్వరం పరిష్కరించాల్సి ఉందని, ప్రైవేటు పెట్టుబడులు పెరిగేందుకు సరికొత్త సంస్కరణలు అవసరమని తెలిపారు. ప్రైవేటురంగ విశ్లేషకుల నుంచి వృద్ధిరేటు అంచనాలు వేర్వేరుగా ఉంటున్నాయని, వీటిల్లో చాలావరకు ప్రభుత్వ అంచనాల కంటే తక్కువగా ఉంటున్నాయని అప్పట్లో పదేపదే రాజన్ గుర్తు చేశారు. దేశంలో ఆటోమొబైల్ రంగ క్షీణత అన్నది నిరుద్యోగాన్ని పెంచే చర్యగా చూడాల్సి ఉంది. కంపెనీలు అమ్మకాలు లేకుండా మూతపడితే నష్టమని గుర్తుంచుకోవాలన్నారు. ఆర్థిక వ్యవస్థ మందగమనం తీవ్ర ఆందోళనకరమని, పరిష్కారానికి నూతన సంస్కరణలు అవసరమని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పూర్వ గవర్నర్ రఘురామ్ రాజన్ అప్పట్లో చేసిన హెచ్చరికలు పట్టించు కోలేదు. మొత్తం మీద ఆర్థిక వ్యవస్థ మందగమనం తీవ్ర ఆందోళనకరమని అన్నారు. వివిధ రంగాలు ఇబ్బంది పడుతున్నా, వాహన రంగం మాత్రం రెండు దశాబ్దాల్లోనే ఎన్నడూ లేనంత సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సంగతి విదితమే. వాహన, అనుబంధ రంగాల్లో వేలసంఖ్యలో ఉద్యోగాలు తొలగి స్తున్నారని, స్థిరాస్తి రంగంలో అమ్ముడు కాకుండా నిర్మాణాలు భారీగా మిగిలిపోతున్నాయని, ఎఫ్‌ఎంసీజీ రంగంలో విక్రయాలు తగ్గుతున్నాయనే ఆందోళనలు పెరుగుతున్నాయి. ఆయా రంగాల నుంచి ఉద్దీపనల కోసం విజ్ఞప్తులు అధికమవుతున్నాయని రాజన్ గుర్తు చేశారు. ప్రస్తుతం కంటే వృద్ధిరేటును మరో 2–3 శాతం పెంచాలంటే, ఏ విధంగా దేశాన్ని ముందుకు నడిపించాలనే విషయంపై అవగాహన ఉండాలి. విద్యుత్తు, ఎన్‌బీఎఫ్‌సీ రంగాల్లో సత్వరం సమస్యలు పరిష్కరించాలి. ప్రైవేటు రంగం నుంచి పెట్టుబడులు వచ్చేలా దీర్ఘకాలిక దృక్పథం కలిగిన సంస్కరణలూ కావాలి. ప్రోత్సాహకాలు, ఉద్దీపనలు తాత్కాలికంగా మాత్రమే ఉపకరిస్తాయి. జీడీపీని మనం ఎలా గణిస్తున్నామో, స్వతంత్ర నిపుణుల పర్యవేక్షణ ఉండాలని రాజన్ విశదీకరించారు. గత ఆర్థిక సంక్షోభంతో పోలిస్తే, ప్రస్తుతం అంతర్జాతీయంగా బ్యాంకుల స్థితి బాగానే ఉందని రాజన్ తెలిపారు. 2008లో పరపతి విధానం కీలకమైంది. ఇప్పుడు మెరుగైన విధానం కాదు, ప్రత్యేక విధానం కావాలి. మరో భారీ ఆర్థిక సంక్షోభం వస్తుందని భావించడం లేదని అయితే మన జాగ్రత్తలో మనం ఉండాలన్నారు. కరోనా నేపథ్యంలో అన్ని అంచనాలు తలకిందులు అయ్యాయి. వాటిని గమనంలోకి తీసుకుని ముందుకు సాగాల్సిన సమయమిదని ఆర్థిక వేత్తలు సూచిస్తున్నారు. బ్యాంకింగ్ రంగాన్ని పట్టాలకెక్కించేందుకు అన్ని బ్యాంకులు యత్నిస్తున్నాయి. గృహ,వాహన రుణాలపై వడ్డీలు తడిసి మోపెడు కావడంతో మందగమనం కనిపిస్తోంది. అలాగే కస్టమర్లపై ఎడాపెడా వడ్డింపులకు దూరంగా ఉండాలని నిపుణులు చూస్తున్నారు.. ఇప్పటికే బ్యాంకుల తీరుపై ప్రజల్లో అసంతృప్తి ఉంది. ఆన్‌లైన్ లావాదేవీలను ప్రోత్సహించాలని చూస్తోంది. యోనో వంటి యాప్‌ల ద్వారా, దేశీయంగా డెబిట్ కార్డుల వినియోగాన్ని తగ్గిం చగలమనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దేశం మొ త్తంమీద దాదాపు 93 కోట్ల డెబిట్, క్రెడిట్‌కార్డులు విని యోగంలో ఉన్నాయని వెల్లడించారు. యోనో యాప్ సాయంతో నగదు ఉపసంహరించవచ్చని, కార్డు లేకుండా దుకాణాల్లో చెల్లింపులు పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు.

## అత్యంత కఠిన నియమాలకు

# ప్రతీక వారాహి దీక్ష

### కార్యసిద్ధి కోసం కఠిన నియమాలతో పూజలు

### డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దీక్షతో సర్వత్రా చర్చ



**అమరావతి, జూన్ 27 :** డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ వేషధారణ, ఆయన ప్రచార రథంపేరు వారాహి కావడంతో ఇప్పుడు వారాహి మాత పేరు మారుమోగిపోతోంది. ఇందుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆ అమ్మవారి దీక్షను చేపట్టడం కూడా ఓ కారణంగా చూడాలి. 11 రోజుల పాటు పవన్ వారాహి మాత దీక్షలో ఉన్నారు. ఈ దీక్షలో భాగంగా 11 రోజుల పాటు పవన్ కల్యాణ్ కేవలం పాలు, పండ్లు, ఇతర ద్రవరూప ఆహారం మాత్రమే తీసుకుంటారు. గతేడాది కూడా జూన్ నెలలో పవన్ వారాహి విజయ యాత్ర చేపట్టారు. ఆ యాత్ర సందర్భంగా వారాహి అమ్మకు పూజలు నిర్వహించారు. అప్పట్లో కూడా వారాహి మాత వార్తల్లో నిలిచారు. కాకపోతే ఈసారి డిప్యూటీ సీఎం హోదాలో పవన్ దీక్ష చేపడుతుండటం విశేషంగా చెప్పుకోవాలి. పవన్ కల్యాణ్‌కు దైవభక్తి ఎక్కువే అంటారు. ఆయన అందరికి భిన్నంగా వారాహి అమ్మవారిని పూజిస్తారు. ఎన్నికల ముందు కూడా రాష్ట్ర వ్యాప్తంగా యాత్రకు సిద్ధం చేసుకున్న వాహనానికి కూడా వారాహి అని పేరు పెట్టారు. ఏపీ ఎన్నికల్లో ఘన విజయం సాధించటంతో ఈ ఏడాది కూడా వారాహి మాత దీక్షను కంటిన్యూ చేస్తున్నారు. గతంలో కూడా పవన్ చాలా దీక్షలు చేపట్టారు. చాతుర్మాస దీక్ష చేశారు. నాలుగు నెలల పాటు ఈ దీక్షలో పవన్ కొనసాగారు. ఆషాడం, శ్రావణం, భాద్రపదం, ఆశ్వీజం మాసాల్లో పవన్ దీక్ష చేపట్టారు. ఆ దీక్షలో కూడా ఆహార నియమాలు పాటించారు. సాత్వికా హారం మాత్రమే తీసుకునేవారు. దీక్ష విరమించే సమయంలో హోమం కూడా నిర్వహించారు. ఇంతకీ వారాహి మాత దీక్ష ఏమి ఆశించి చేస్తారు? ఎలా చేస్తారు? ఎవరు చేస్తారు? వీటి గురించి తెలుసుకుందాం.. మనో అభీష్టాలను నెరవేర్చే వారాహి అమ్మవారు అత్యంత శుభ ఫలితాలను ఇస్తారు. జూన్ నెలాఖరుతో మొదలై జూలై 9 వరకు అమ్మవారి గుప్త నవరాత్రులు ముగుస్తాయి. ఈ సమయం గురించి ఎక్కువగా ప్రచారంలో లేదు. చాలా తక్కువ మందికి మాత్రమే ఈ విషయం తెలుసు. మన సంప్రదాయంలో ఉన్న నాలుగు నవరాత్రుల్లో అత్యంత మహిమాన్వితమైనవి, శక్తిమంతమైనవి ఈ ఆషాఢ మాస గుప్త నవరాత్రులు. ఎవరైతే ఈ నవ రాత్రులు అత్యంత నిష్ఠతో, శ్రద్ధతో దీక్ష ఆచరిస్తారో వారి సమస్యలన్నీ అమ్మవారి అనుగ్రహంతో తీరిపోతా యనేది పెద్దల విశ్వాసం. సప్తమాతృకలలో వారాహి మాత ఒకరు. ఈమె లలితా పరమేశ్వరి సర్వ సైన్యాధ్య క్షురాలు. మహాలక్ష్మి ప్రతిరూపం, సర్వ మంగళ స్వరూపం. దుష్ట శిక్షణ, శిష్ఠ రక్షణకు అమ్మవారు ఆయుధాలు ధరించి ఉంటారు. చూడటానికి ఉగ్రరూపంగా కనిపించినప్పటికీ ఆమె చాలా కరుణామయి. అయితే వారాహి ఆరాధన అందరూ చేయకూడదన్న అపోహ ఉండటం వల్ల చాలా మందికి వారాహి మాత గురించి పెద్దగా తెలియదు. కానీ ఇది సత్యదూరం. ఎవరైనా వారాహి మాతను పూజించవచ్చు. అరిషడ్వర్గాలు అమ్మ అధీనంలో ఉంటాయి. కామ,క్రోధ, మద, మోహ, మాత్సర్యాల నుంచి అమ్మవారు మనల్ని రక్షిస్తుందని అనుభవజ్ఞుల మాట. మన మనస్సును నియంత్రిస్తుంది. వారాహి మాత భూదేవి నాగలిని, రోకలిని ధరించిన ధాన్య దేవత కూడా. పంటలు సరిగా పండాలన్నా, వ్యవసాయం అనుకూలించాలన్నా ప్రతి రైతు వారాహి మాత ఆరాధాన చేయాలని చెబుతారు. వారాహి మాత దీక్ష శ్రద్ధతో చేసిన వారికి వారు కోరుకున్నవన్నీ జరుగుతాయి. భూ సమస్యలు పరిష్కారమవుతాయి. భూ తగాదాలు, కోర్టు కేసులు, శత్రు సమస్యలు, తీవ్ర అనారోగ్య సమస్యలు, జీవితంలో స్థిరత్వం లేకున్నా. మనకు రక్షణ కావాలన్నా, ఇంట్లో తరచూ అశుభాలు జరుగుతున్నా, ఆర్థిక స్థిరత్వం లేకున్నా, అప్పుల బాధల నుంచి విముక్తి పొందాలన్నా వారాహి మాత దీక్ష చేస్తే చాలు ఎలాంటి సమస్య అయినా ఇట్టే పరిష్కారం అయిపోతుందంటారు. వారాహి మాత దీక్ష చేపట్టేవారు రోజూ ఉదయాన్నే లేచి తలస్నానం చేశాక దీక్షా వస్త్రాలు ధరించాలి. అలా వీలు కాని వారు మెడలో దీక్షగా ఒక కండువాను తొమ్మిది రోజుల పాటు ధరించాలి. నిత్యం వారాహి మాత అష్టోత్తర నామాలు, కానీ సహస్ర నామాలు కాని చదువుతూ అమ్మవారికి కుంకుమార్చన చేయాలి. ఎర్రటి పూలతో పూజించాలి. దానిమ్మ గింజలను నైవేద్యంగా పెట్టాలి. దీక్షలో ఉన్నన్ని రోజులు పాదరక్షలు ధరించరాదు. మద్య,మాంసాలకు దూరంగా ఉండాలి, బ్రహ్మచర్యం పాటించాలని, నేలపైనే చాప పరిచి పడుకోవాల్సి ఉంటుందని పండితులు పూజా క్రతువును వివరించారు. ఆచరించటానికి మాత్రం ఇది కాస్త కఠినంగానే ఉంటుంది. అయితే అమ్మవారి అనుగ్రహం పొందటానికి ఈ మాత్రం చేయగలగాలన్న ధృడచిత్తం కావాలి. మన పురాణాల్లోని సప్తమాతృకల్లో వారాహి మాత ధైర్యం, నిర్భయతకు గుర్తుగా చూస్తారు. వారాహి మాతను ధ్యానించడం లేదా ఆరాధించటం ద్వారా సి÷–ది పొందవచ్చని అంటారు.



# మొక్కల పెంపకం సామాజిక బాధ్యత

**•గ్రీన్ కవర్ పెంచేలా కృషి చేయాలి •నిరంతరంగా మొక్కల పెంపకం సాగాలి**



**నిజామాబాద్, ప్రజానావ :** హరితహారం కావచ్చు, మొక్కలు నాటడం కావచ్చు. పచ్చదన్నం కావచ్చు.. కార్యక్రమం ఏదైనా మొక్కలు పెంచడం, కాపాడుకోవడం ప్రజల విధి కావాలి. ఇందుకు ప్రభుత్వం కూడా గట్టిగా కృషి చేయాలి. ఇది ప్రతి ఒక్కరి కార్యక్రమమని, దీనిని సమిష్టిగా చేపట్టినప్పుడే ఫలితాలు రాబట్టవచ్చని గుర్తించాలి. తాము చేపట్టిన హరితహారం కార్యక్రమం వల్ల గ్రీన్ కవర్ 7.7 శాతం పెరిగిందని గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రకటించుకుంది. ఇది నిరంతరంగా సాగితే త్వరలోనే తెలంగాణ ఆకుపచ్చని తెలంగాణ కాగలదని అన్నారు. అయితే ప్రభుత్వంలో ఎవురు ఉన్నా లేకున్నా..మొక్కలు పెంచడం నిరంతర ప్రకరియ కావాల్సి ఉంది. దీనిని మరింత చైతన్యవంతంగా తీసుకుని వెళితే కోతులు వాపస్ పోవడం.. వానలు వాపస్ రావడం ఖాయం కాగలదు. జూన్ మాసాంతం వచ్చినా నేటికీ వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవడానికి వర్షాభావ వాతావరణమే కాకరణం. మొక్కలు నాటడం, పెంచడం అన్నది నిరంతర పక్రియ అని ప్రజలంతా గుర్తుంచుకోవాల్సి ఉంది. వంద శాతం పచ్చదనం ఉండేలా మొక్కలు నాటాల్సిన అవసరం ఉంది. ప్రతి ఒక్కరూ దీనిని సామాజిక బాధ్యతగా గుర్తించి ప్రభుత్వంతో కలసి రావాల్సి ఉంది. ప్రతి జిల్లాను హరిత జిల్లాగా మార్చాలనీ, ఇందుకు అధికారులంతా సమష్టిగా కృషి చేయాల్సి ఉంది. రోడ్లకు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టాలి. ఏ రకం మొక్కలు ఏయే ప్రదేశాల్లో నాటాలో అటవీ శాఖ అధికారులు సూచనలివ్వాలి. సరైన సమయంలోనే మొక్కలు నాటడం చేపట్టాలి. వెన్యూ ప్లాంటేషన్‌కు పండ్ల మొక్కలను సంబంధిత గ్రామప్రజలతో మాట్లాడి వారి సహాయ సహకారాలతో నాటితే కోతుల బాధ కొంతయినా పోతుంది. ప్రభుత్వ నర్సరీల్లో మొక్కలు సరైన దశలో వృద్ధి చెందిన మీదటే నాటేందుకు చర్యలు చేపట్టాలి. అన్ని పాఠశాలల్లో పచ్చదనం ఉండేలా మొక్కలు నాటేలా విద్యార్థులను ప్రోత్సహించేలా చర్యలు చేపట్టాలి. పట్టణాల్లో జంక్షన్లు, రోడ్ల సుందరీకరణకు మొక్కలు నాటాలి. అవసరాలకు ఏయే రకం మొక్కలు ఎన్ని కావాలో సర్వే చేసి తదనుగుణంగా నర్సరీల్లో మొక్కల పెంపకం చేపడితే ప్రయోజనం చేకూరుతుంది. ఈ సంవత్సరం లక్ష్యాన్ని చేరుకునే విధంగా మొక్కలను నాటాల్సి ఉంది. అధికారులు దృఢనిర్చయంతో ముందుకు సాగాలి. గతేడాది వరుణ దేవుడు కరుణించడంతో నాటిన మొక్కలు జీవం పోసుకుంటున్నాయి. ఇందులో భాగంగానే ఫారెస్ట్ నర్సరీలో లక్షల్లో వివిధ రకాల మొక్కల పెంపకం, అలాగే ఈజీఎస్ కింద వివిధ రకాల మొక్కలను పెంచిపోషిస్తున్నారు. ఈ ఏడాది మంచి వర్షాలు కురుస్తున్న కారణంగా కార్యక్రమాన్ని ఒక మహోత్తర ఉద్యమంగా ముందుకు తీసుకెళ్ళాల్సి ఉంది. మొక్కలు నాటించి ఈజీఎస్ కూలీల ద్వారా నాటిన మొక్కల చుట్టూ రక్షణ కంచెలు సైతం ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేయాలి. కోట్లాది రూపాయల ఖర్చుతో వివిధ శాఖల ఆధ్వర్యంలో పండ్లు, పూలు, అటవీ, మిశ్రమ జాతి మొక్కలతో ఇతర మొక్కల పెంపకాన్ని చేపట్టారు. వన విభాగం కింద ఒకటి, జాతీయ గ్రామిణ ఉపాధి హామి పథకం ఆధ్వర్యంలో నర్సరీలను నెలకొల్పి మొక్కల పెంపకం చేపట్టడం అవసరం.

## రైతుబంధు

# ఎప్పుడిస్తారో చెప్పండి

### జడ్పీ సమావేశంలో హరీష్ రావు డిమాండ్



**సిద్దిపేట, ప్రజానావ:** రైతు బంధు డబ్బులు ఎప్పుడు వేస్తారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు ప్రశ్నించారు. రైతుభరోసా విధివిధానాలు ఏమిటని అడిగారు. రైతుబంధు పంట అయ్యాక ఇస్తారా?.. పంట ముందు ఇస్తారా? అంటూ హరీష్ రావు ప్రశ్నల వర్షం కురిపించారు. సిద్ది పేట జిల్లా కేంద్రంలోని రెడ్డి సంక్షేమ సంఘంలో జడ్పీ చైర్మన్ రోజా శర్మ అధ్యక్షతన జిల్లా ప్రజా పరిషత్ సర్వస భ్య సమావేశం జరిగింది. జిల్లా కలెక్టర్ మను చౌదరి ఎమ్మెల్యేలు హరీష్ రావు, కొత్త ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో హరీష్ రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో సిద్ది పేట జిల్లాను పదవ తరగతి ఫలితాల్లో రెండవ స్థానం లో నిలిపినందుకు ఉపాధ్యాయులకు అభినంద నలు తెలిపారు. నాలుగు నెలల మధ్యాహ్నం భోజన కార్మికులకు జీతాలు వెంటనే విడుదల చేయాలి. విద్యార్థులకు ఒక్క జత బట్టలు మాత్రమే ఇచ్చారు. రెండవ జత బట్టలు అన్ని జిల్లాలకు ఇచ్చినట్లు సిద్దిపేట జిల్లకు వెంటనే ఇవ్వాలి. మన ఊరు మన బడి మిగిలిన పనులను వెంటనే పూర్తి చేసి ఇవ్వాల్సిన బిల్లులు ఇవ్వాలి. ఉపాధి హామీ పథకంలో సీసీ రోడ్ పోసిన కాంట్రాక్టర్లకు 7నెలల నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఏప్రిల్, మే, జూన్ మూడు నెలల ఆసరా పెన్షన్‌లు రాలేదు. సకాలంలో పెన్షన్ రాక వృద్ధులు ఇబ్బం ది పడుతున్నారు. కాళేశ్వరం కాలువలలో మట్టి పడి నీటి విడుదలలో ఇబ్బంది ఉంది కనుక వాటిని శుద్ధి చేయాలి. ఆరు నెలల్లో గ్రామపంచా యితీలకు రూపాయి రాలేదు. మహిళ ప్రాంగణం, వృద్ధాశ్రమం, వర్కింగ్ ఉమెన్ హాస్టల్ వాడుకలోకి తీసుకురావాలి. సఖి సెంటర్ సిబ్బందికి 7నెలలు గా వేతనాలు రాలేదు‘ అని హరీష్‌రావు పేర్కొన్నారు.

## ఎయిమ్స్ నుంచి

# అద్వానీ డిశ్చార్

**న్యూఢిల్లీ, జూన్ 27 :** తీవ్ర అనారోగ్యంతో ఎయిమ్స్‌లో చేరిన మాజీ ఉప ప్రధాని, భారతరత్న ఎల్ కె అద్వానీ ఆరోగ్యం నిలకడగా ఉంది. ఈ నేపథ్యంలో ఆయన్ని గురువారం ఎయిమ్స్ నుంచి వైద్యులు డిశార్జ్ చేశారు. ఆయన ఆరోగ్యంపై మూత్ర ,గుండె, వృద్ధాప్యంకు సంబంధించిన ప్రత్యేక వైద్య బృందం క్షుణ్ణంగా పరీక్షలు నిర్వహించి.. నివేదికలను పరిశీలించింది. అనంతరం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్య బృందం స్పష్టం చేసింది. దీంతో ఆయన్ని డిశార్చ్ చేసినట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. 96 ఏళ్ల ఎల్ కె అద్వానీ బుధవారం రాత్రి తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయన్ని అల్ ఇండియా మెడికల్ సైన్సెన్స్ ఎయిమ్స్‌లో చేర్చిన సంగతి తెలిసిందే.

### జల్ జీవన్‌పై డిప్యూటీ సీఎం పవన్ సమీక్ష

**విజయవాడ, ప్రజానావ :** జల్‌జీవన్ మిషన్‌లాంటి కేంద్ర ప్రభుత్వ పథకాల నిధులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ వివరాలు ఇవ్వాలని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం ఈ పథకం నిధులను వినియోగించుకోలేకపోయిందని వ్యాఖ్యానించారు. గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ విభాగాల అధికారులతో ఆయన గురువారం సమీక్ష నిర్వహించారు. విజయవాడ క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమావేశమైన డిప్యూటీ సీఎం.. తాగునీటి సరఫరాలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇటీవల డయేరియా కేసులు నమోదు అవుతున్న నేపథ్యంలో తాగు నీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. తాగు నీటి సౌకర్యం లేని గ్రామాలపై దృష్టి పెట్టాలని, జల్‌జీవన్ మిషన్ పథకం నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని అధికారులకు దిశానిర్దేశర చేశారు.

www.prajanaava.in
హైదరాబాద్
శుక్రవారం, జూన్ 28, 2024
ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..




# ఫైనల్‌కు టీమిండియా

## ఇంగ్లీష్ జట్టుపై రోహిత్ సేన ఘన విజయం

## వరుసగా రెండో అర్ధ సెంచరీ బాదిన హిట్‌మ్యాన్



**గయానా:** టీ20 వరల్డ్ కప్ 2024 రెండవ సెమీ-ఫైనల్‌లో భారత్ - ఇంగ్లండ్ జట్లు తలపడ్డాయి. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ లో అద్భుత ప్రదర్శనతో ఇంగ్లాండ్ ను చిత్తుగా ఓడించి టీమిండియా విజయాన్ని అందుకుంది. గత వరల్డ్ కప్ ఓటమికి ప్రతీకారం తీర్చుకున్న భారత జట్టు టీ20 ప్రపంచ కప్ 2024 ఫైనల్ కు చేరుకుంది. మెగా టోర్నీ చివరి మ్యాచ్ లో దక్షిణాఫ్రికాతో తలపడ నుంది. రోహిత్ సేన దక్షిణాఫ్రికాను ఓడించి కప్ గెలుచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. భారత జట్టు 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 171 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో ఇంగ్లండ్ జట్టు 16.4 ఓవర్ల లో 103 పరుగులకు ఆలౌట్ అయింది. గయానాలోని ప్రొవిడెన్స్ స్టేడియంలో జరిగిన రెండో సెమీ ఫైనల్ ఈ మ్యాచ్ లో ఇంగ్లండ్ కెప్టెన్ జోస్ బట్లర్ టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. దీంతో టీమిండియా తొలుత బ్యాటింగ్ చేసింది. ఇరు జట్ల ప్లేయింగ్-11లో ఎలాంటి మార్పులు చేయలేదు. వర్షం కారణంగా టాస్ దాదాపు 1:30 గంటలు ఆలస్యమైంది. టీమిండియా సీనియర్ స్టార్ ప్లేయర్లు రోహిత్ శర్మ-విరాట్ కోహ్లీల జోడీ బ్యాటింగ్ ను ప్రారంభించింది. ఈ టోర్నీలో మరోసారి విరాట్ కోహ్లీ బ్యాట్ పని చేయలేదు. టాప్లీ వేసిన ఓవర్ నాలుగో బంతిని కూడా భారీ షాట్ కొట్టడానికి ప్రయత్నించాడు.. కానీ కనెక్షన్ కుదరకపోవడంతో క్లీన్ బౌల్డ్ అయ్యాడు. 4 పరుగుల వద్ద పంత్ ఔట్ అయ్యాడు.

### హిట్‌మ్యాన్ మరోసారి..

అయితే, మరో ఎండ్ రోహిత్ శర్మ ధనాధన్ బ్యాటింగ్ కొనసాగించారు. భారత స్కోర్ బోర్డును పరుగులు పెట్టించారు. సూర్యకుమార్ యాదవ్ తో కలిసి భారత ఇన్నింగ్స్ ను ముందుకు తీసుకెళ్లాడు. 13వ ఓవర్ మూడో బంతికి సామ్ కుర్రాన్ వేసిన ఓవర్ లో సిక్సర్ బాది హిట్‌మ్యాన్ అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. భారత్ 13 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 110 పరుగులు చేసింది. 14వ ఓవర్ నాలుగో బంతికి భారత కెప్టెన్ రోహిత్ శర్మ ఔటయ్యాడు. ఆదిల్ రషీద్ బౌలింగ్‌లో హిట్‌మన్ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. 39 బంతుల్లో 57 పరుగుల తన ఇన్నింగ్స్ రోహిత్ 6 ఫోర్లు, 2 సిక్సర్లు బాదాడు. మొత్తంగా రోహిత్‌కు 32వ హాఫ్ సెంచరీ. మరో ఎండ్ లో ఉన్న సూర్యకుమార్ యాదవ్ మంచి షాట్స్ ఆడుతూ పరుగులు రాబట్టాడు. 36 బంతుల్లో 47 పరుగులు చేసి ఔటయ్యాడు.హార్దిక్ పాండ్యా 2 సిక్సర్లు, ఒక ఫోర్ తో 23 పరుగులు, రవీంద్ర జడేజా 17లి, అక్షర్ పటేల్ 10 పరుగులు చేయడంలో టీమిండియా 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 171 పరుగులు చేసింది.

### బెంబేలెత్తించిన భారత బౌలర్లు..

172 పరుగుల టార్గెట్ తో బరిలోకి దిగిన ఇంగ్లాండ్ ను భారత బౌలర్లు బెంబేలెత్తించారు. అద్భుతమైన బౌలింగ్ తో ఇంగ్లండ్ ప్లేయర్లను వరుసగా పెవిలియన్ పంపారు. జోస్ బట్లర్ 23 పరుగులు, హ్యారీ బ్రూక్ 25 పరుగులు, జోఫ్రా ఆర్చర్ 21 పరుగులు మినహా మిగతా ప్లేయర్ల ఇలా వచ్చి అలా పెవిలియన్ కు వెళ్లారు. దీంతో ఇంగ్లాండ్ జట్టు 103 పరుగులకే ఆలౌట్ అయింది. భారత బౌలర్లు సమిష్టిగా రాణించారు. అక్షర్ పటేల్ మొదటు పెట్టిన వికెట్ల వేటను కుల్దీప్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రాలు ముగించారు. అక్షర్ పటేల్ 3 వికెట్లు, కుల్దీప్ యాదవ్ 3 వికెట్లు తీసుకున్నారు. వీరికి తోడుగా జస్ప్రీత్ బుమ్రా రెండు వికెట్లు పడగొట్టాడు. మొత్తంగా బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ లో సూపర్ ప్రదర్శనతో ఇంగ్లాండ్ ను చిత్తుగా ఓడించిన భారత జట్టు టీ20 ప్రపంచ కప్ 2024 ఫైనల్ మ్యాచ్‌ను దక్షిణాఫ్రికాతో శనివారం బార్బడోస్ వేదికగా తలపడనుంది.

# ఆశలు ఆవిరి

## దక్షిణాఫ్రికాపై పసికూన అఫ్గాన్ పరాజయం

## తొలిసారి ఫైనల్‌కు చేరిన సఫారీలు

ట్రినిడాడ్: టి20 ప్రపంచకప్‌లో సౌతాఫ్రికా ఫైనల్‌కు చేరుకుంది. గురువారం అఫ్గానిస్థాన్‌తో జరిగిన తొలి సెమీ ఫైనల్లో దక్షిణాఫ్రికా 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. వరల్డ్‌కప్ వంటి మెగా టోర్నమెంట్‌లో సఫారీ టీమ్ తుది పోరుకు చేరుకోవడం ఇదే తొలిసారి. లీగ్ దశతో పాటు సూపర్8లో అసాధారణ ఆటతో అదరగొట్టిన అఫ్గాన్‌సెమీస్‌లో మాత్రంపూర్తిగా చేతులెత్తేసింది. తొలుత బ్యాటింగ్ చేసినఅఫ్గాన్ 11.5 ఓవర్లలో కేవలం 56 పరుగులకే కుప్పకూలింది. తర్వాత లక్షఛేదనకు దిగిన సౌతాఫ్రికా 8.5 ఓవర్లలోనే ఒక వికెట్ మాత్రమే కోల్పోయి విజయాన్ని అందుకుంది. ఓపెనర్ క్వింటన్ డికాక్ ఐదు పరుగులు మాత్రమే చేసి ఔటయ్యాడు. అయితే తర్వాత వచ్చిన కెప్టెన్ ఐడెన్ మార్‌క్రమ్‌తో కలిసి మరో ఓపెనర్ రీజా హెండ్రిక్స్ సౌతాఫ్రికా అలవోక విజయం సాధించి పెట్టాడు. హెండ్రిక్స్ 25 బంతుల్లో 3 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 29 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. మార్‌క్రమ్ 21 బంతుల్లో 4 బౌండరీలతో అజేయంగా 23 పరుగులు సాధించాడు. దీంతో సౌతాఫ్రికా సునాయాస విజయంతో ఫైనల్ బెర్త్‌ను దక్కించుకుంది.




### జాన్‌సెన్ మ్యాజిక్..

అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అఫ్గానిస్థాన్‌కు ఆరంభంలోనే కష్టాలు మొదలయ్యాయి. ఫామ్‌లో ఉన్న ఓపెనర్లు రహ్మానుల్లా గుర్బాజ్, ఇబ్రహీం జద్రాన్‌లు నిరాశ పరిచారు. 3 బంతులు ఎదుర్కొన్న గుర్బాజ్ ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరాడు. ఈ వికెట్‌కు మార్కొ జాన్‌సెన్‌కు దక్కింది. వన్‌డౌన్‌లో వచ్చిన గుల్బదిన్ నైబ్ కూడా నిరాశ పరిచాడు. 2 ఫోర్లతో 9 పరుగులు చేసిన గుల్బదిన్‌ను మార్కొ జాన్‌సెన్ క్లీన్‌బౌల్డ్ చేశాడు. ఆ వెంటనే మరో ఓపెనర్ ఇబ్రహీం జద్రాన్ (2) కూడా ఔటయ్యాడు. రబడా అద్భుత బంతితో జద్రాన్‌ను వెనక్కి పంపాడు. జట్టును ఆదుకుంటాడని భావించిన సీనియర్ ఆటగాడు మహ్మద్ నబి కూడా విఫలమయ్యాడు. 3 బంతులు ఎదుర్కొన్న నబి ఖాతా తెరవకుండానే వెనుదిరిగాడు. రబడా అతన్ని క్లీన్‌బౌల్డ్‌గా వెనక్కి పంపాడు. కొద్ది సేపటికే నంగెయాలియా ఖరోటే (2) కూడా పెవిలియన్ చేరాడు. అతన్ని జాన్‌సెన్ ఔట్ చేశాడు.

### షంసి మ్యాజిక్..

సౌతాఫ్రికా బౌలర్లు వరుస క్రమంలో వికెట్లు తీయడంతో అఫ్గాన్ ఏ దశలోనూ కోలుకోలేక పోయింది. అజ్మతుల్లా (10) ఒక్కడే డబుల్ డిజిట్ మార్క్‌ను అందుకున్నాడు. కాగా, చివర్లో తబ్రేస్ షంసి అసాధారణ బౌలింగ్‌తో చెలరేగి పోయాడు. కరీం జన్నత్ (8), నూర్ అహ్మద్ (0), నవీనుల్ హక్ (2)లను షంసి వెనక్కి పంపాడు. కెప్టెన్ రషీద్ ఖాన్ (8) పరుగులు చేసి నోర్జె వేసిన అద్భుత బంతికి క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. అఫ్గాన్ ఇన్నింగ్స్‌లో అత్యధిక పరుగులు ఎక్స్‌ట్రాల రూపంలో రావడం విశేషం. అఫ్గాన్‌కు 13 ఎక్స్‌ట్రాలు లభించాయి. ఇక సౌతాఫ్రికా బౌలర్లలో జాన్‌సెన్, షంసి మూడేసి వికెట్లను పడగొట్టారు. రబడా, నోర్జెలు రెండేసి వికెట్లను పడగొట్టి అఫ్గాన్ ఇన్నింగ్స్‌ను 56 పరుగులకే కుప్పకూల్చారు.



Printed, Published and Owned by Adula Thirupathi, Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street, Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. TELTEL02116